# ఆకొండివారివైద్యము

ఆకొండి రామమూర్తి భిషగ్వరుల

శిష్యులగు

## మధునాపంతుల సత్యనారాయణ మూర్తిగారిచే

వ్రాయఁబడి

మొదటికూర్పు 1000 ప్రతులు

పిఠాపురము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాశాలయందు

ముద్రింపఁబడినది.

1927

# పీఠిక.

వైద్య మెఱుంగనినేను, వైద్యగ్రంథ మగుదీనికిఁ బీఠిక వ్రాయఁబూనుకొనుట యసందర్భముగా నుండక తప్పదు. కాని, వైద్యజ్ఞానము లేనివారు వైద్యమును జేయుటకుఁ బూనుకొనుటకంటె నసందర్భముగా నుండ దని నానమ్మకము. శబ్దశుద్ధిలేని యవతారికవలన, నాభిశుద్ధిలేని యానందభైరవివలనఁ గలుగునంత యపాయము కలుగునా? ఆయుర్వేదజ్ఞానశూన్యుఁడైనవైద్యుఁ డంతికయమదూత యని మనపెద్దలు వచించినారు. వైద్యవృత్తి నవలంబింపఁ దలఁచువా రందఱు వైద్యగ్రంథములు చాలవఱ కభ్యసింపక తప్పదు. అట్టిగ్రాంథికజ్ఞానమున కనుభవము తోడగుకొలఁది రోగనిదానజ్ఞానము బలమగును. రోగ మేదియో నిర్ణయింపకుండ వైద్యమొనర్చుట యనుపయోగమే కాక యపాయకరముగూడఁ గావున రోగనిదానమే వైద్యమునకుఁ బ్రిప్రధానము.

ఆత్మకు దుర్గతి నిచ్చుకామక్రోధాదులను యోగాభ్యాసాదిసాధనములవలనను, జ్ఞానోపదేశమువలనను బోఁగొట్టి శిష్యునకుఁ గైవల్య మొసఁగఁగలగురుఁ డెట్టివాఁడో దేహపాటవభంగకరము లైనవ్యాధులను మందులమూలమునను బథ్యములమూలమునను నివారించి దేహికైహికసుఖమును

ప్రసాదించు వైద్యుఁ డట్టివాఁడు. తనకార్యనిర్వహణమునకై గురుఁ డెంతయాధ్యాత్మికవిద్యాజ్ఞాననిధియై యుండవలయునో, తనకార్యనిర్వహణమునకై వైద్యుఁ డంతయాయుర్వేదజ్ఞాననిధియై యుండవలయును. గురుఁ డెట్టిప్రేమస్వరూపుఁడై యుండవలయునో, వైద్యుఁ డట్టిప్రేమస్వరూపుఁడై యుండవలయును. గురునివలెనే వైద్యుఁడు నిష్కలుషచిత్తుఁడై, సత్యవాదియై, ధనాశాదూరుఁడై, ప్రజాహితతత్పరుఁడై యుండవలయును.

వైద్యుఁడు తననాఁడే వైద్యమును సంపాదించినవాఁడు కాక, వైద్యకుటుంబములోఁ జేరినవాఁడై యుండుట సర్వోత్తమము. అట్టివానికిఁ బితృపితామహాదిపూర్వుల భేషజశాస్త్రజ్ఞాన మంతయు, ననుభవభాగ్య మంతయు వంశపరంపరాగతధనసమూహమువలెఁ గరతలగతమై యుండును. అదిగాక తాతముత్తాతలనుండి యనేకవిచిత్రయోగములు గ్రంథస్థములు కానివి యొక్కొక్కవంశములో వచ్చుచుండును.

తనమందును రోగి గొంతుకలోఁ బోయుటకుముందు తనయందు విశ్వాసమును రోగి మనస్సులోఁ బ్రవేశపెట్టుటకు వైద్యుఁడు ప్రయత్నింపవలయును. వైద్యుఁడు రోగిశయ్యయొద్దఁ బ్రసన్నవదనుఁడై యుండవలయును గాని సంకుచితముఖుఁడై వ్యాకులచిత్తుఁడై యుండఁగూడదు. రోగితత్త్వమును బరీక్షించుటకు వైద్యుఁ డెంతయాసక్తితో నుండునో,



వైద్యుని మొగమును బరీక్షించుటకు రోగి యంతకంటె నెక్కువయాసక్తితో నుండును. కావున సందేహముకాని, భయముకాని, నిరాశకాని వైద్యుఁడు తనమొగమునం దెన్నఁడుఁ గానఁబఱుపఁగూడదు. ఎన్నియెన్ని దుష్టలక్షణము లంకురించినను హాని నవలీలగ మాన్పఁగలిగినట్లు వైద్యుఁడు కనఁబడవలయును. తన కున్నబాధ లన్నియు, భ్రమమువలనఁగలిగిన బాధ లన్నియు, ముం దెప్పుడో రావచ్చు ననుకొన్నబాధ లన్నియుఁ జర్వితచర్వణముగ నేకరువుపెట్టుట రోగిస్వభావము. వాని నన్నియు నాదరముతో విని సదుత్తరము లిచ్చుట వైద్యునివిధి. రోగి తనరోగనివారణమునకు వైద్యు నెంతగాఢముగ నమ్మునో, వైద్యుఁడు వ్యాధిగ్రస్తునివ్యాధి నిర్మూలనమునకు భగవంతు నంతగాఢముగ నమ్మవలయును.

రోగికి రోగదశయందుఁ గొన్నిభక్ష్యపదార్థములపై వాంఛ జనించును. తినవలయు నని యేవస్తువునందైన రోగికి వాంఛకలుగుట సులక్షణము కాని దుర్లక్షణము కాదు. అట్టిచో వైద్యుఁడు రోగివాంఛను వ్యర్థపఱుపక, యాభక్ష్యవస్తువు నాతనికి మితముగ నిచ్చి రోగము కుదుర్పవలయును. ఆవస్తువును దినుపర్యంతము రోగికి రోగనివారణము కాకుండుట యనేకస్థలములయందుఁ గలదు.

వైద్యునికుండవలసినప్రశస్తగుణము లనేకము లాకొండి వారివంశమునఁ బుట్టినపురుషుల కున్నట్లు వినుచున్నాము.

వారివైద్యము వంశపరంపరాగతమై వన్నెకెక్కి యున్నది. వారిలో ననేకుల వైద్యసామర్థ్యమునుగూర్చి చిత్రములైన కథలు చెప్పుదురు. కొన్నికథ లీగ్రంథకర్త సేకరించి గ్రంథమున వ్రాసినారు.

ఈగ్రంథకర్త గ్రంథమును వ్రాయుకాలమందు లభింపని రెండు దానశాసనములు గ్రంథ మచ్చుపడినతరువాత గ్రంథకర్తమామగా రగు బ్రహ్మశ్రీ ఆకొండి రామమూర్తిశాస్త్రిలుగారి పురాతనపత్రసంచయమున యాదృచ్ఛికముగా దొరకినవి. తత్పూర్వమే యవి గ్రంథకర్తకు లభించియుండు నెడల వానినిగూర్చి గ్రంథమున విపులముగ వ్రాసియేయుండును. ఆకొండి రామమూర్తిశాస్త్రిలుగారి కైదవమూలపురుషుఁడైన రామయ్యగారికిఁ బెద్దాపురాధీశుఁడగు శ్రీ శ్రీ వత్సవాయ జగపతిరాజుబహద్దరుగారు వ్రాయించియిచ్చినభూదానశాసన మీరెండుశాసనములలో నొక్కటి. ఈభూదానమునకుఁ గారణ మీదిగువనే వ్రాయుచున్నాను.

అప్పటిపెద్దాపురప్రభువునకు భయంకరమగు రక్తాతిసారము కలిగెను. ఎన్నిచికిత్స లాచరించినను నది శాంతింపలేదు సరికదా, క్రమముగా వృద్ధియగుచుండెను. అప్పు డాకొండి రామయ్యగారిని మహారా జాహ్వానించి యాయనచే మందు దీసికొనఁగ దైవకటాక్షమువలనను బ్రజలపుణ్యమువలనను



మహారాజునకు వ్యాధి కుదిరినది. అప్పుడు నాల్గుపుట్లభూమి యీమహారాజవైద్యునకు మహారాజు దానమొసర్చినాడు.

ఆనాఁటిపట్టానుగూర్చి వ్రాయుభాగ్యము నాకుఁ గలిగినది. అది శాలివాహనశకము 1693 వ నాఁటిది. దానిని గాంచి సంకోచించుచు గ్రహించితిని. సంకోచ మేల యందురా? చేతితోఁ దాకినయెడల దానిమీఁదిసిరా యెక్కడఁ జెరగిపోవునో యనుసందేహము నాకుఁ గలిగినది. వందలకొలఁది సంవత్సరములక్రిందట వ్రాయఁబడిన శాసన మొకపావుగంట క్రింద వ్రాయఁబడినట్లున్నది. దానిలోనియక్షరములు జిలజిలలాడునట్లు, జీవకళ లుట్టిపడునట్లు, పత్రముమీఁదినుండి పైకుబుకునట్లు, చల్లఁగ నిశ్శబ్దముగఁ బ్రవహించునట్లు, ముత్యాలకోవలవలెఁ దొండపుగొలుసులయల్లికలవలె స్పష్టముగా జిగిబిగిగా నేత్రపర్వమై కానఁబడుచున్నవే—అట్టియద్భుతలేఖనవైఖరి యిప్పు డంతరించినదికదా! ఆహా! ఎంతదురదృష్టము! పూర్వులబుద్ధివైశద్యములు కల్పనాచమత్కృతులు కళాచాకచక్యములు మనకుఁ బూర్ణానుస్వారములైనను వారిదస్తూరివైఖరినైన మన మనుకరింపలేనప్పుడు మనప్రజ్ఞాహీనత, మన భాగ్యహీనత, మనప్రాచీనవస్తుగౌరవహీనతయెంతయో పలుకవశమా? ‹‹ ఇప్పటివారి వ్రాఁతలు తలవెండ్రుకలచిక్కులు, గొగ్గిపండ్లు, గుడ్డిగ్రచ్చకాయలు, సిరాలో మునిఁగినసాలెపురుగుప్రాకుటలు, కోడికొక్కరింపులు, కొంకిబికులు, లుకలుకలు,

తికమక" లని జంఘాలశాస్త్రి చెప్పనే చెప్పినాఁడు. మన వారింతలు తిన్నగనే యుండునెడల మన కీదురవస్థ లేల? పూర్వౌన్నత్యము, పూర్వవిద్యాపద్ధతి, పూర్వపరిశుద్ధి, పూర్వభాగ్యము, పూర్వస్వాతంత్ర్యము, పూర్వపక్షము కానేల? తిరోధానమైన దేశసౌభాగ్యమునుగూర్చి దేహము లున్నన్నినాళ్లేడ్వవలసినదే కాని రవంత బాగుపన్న వినియోగమేమున్నది? కావున నీయేడ్పులకు శాంతిచెప్పి మహానందసంధాయక మగు నొకసన్నివేశమును గానఁబఱతును చూచెదరా? ఈదానశాసనమును జూచి యొక్కనిముసము కన్నుల మూసికొంటిని. స్వాప్నికప్రకృతి కల వృద్ధుఁడ నగునా కానిమేషకాలములో నేమి కానఁబడెనో మీరుకూడఁ జూడవలదా?

పెద్దాపురపుఁగోటలో దర్బారుమహాలులో మొగముల బుగ్గమీసలు చెవులసందున నెమిలికలములు నడుములకు బంధములు కముపులపై జోడించినహస్తములు గల సచివాది మహోద్యోగు లొకప్రక్క బారులు తీర్చియుండ, రెండవ ప్రక్క శిరముల రాంకవములతోఁ జెవుల కుండలములతోఁ జేతఁ బుష్పసహితమంత్రాక్షతలతోఁ బురోహితులు విద్వాంసులు నగుబ్రాహ్మణోత్తములు స్వస్తివాచనము లొనర్చుచుండ, మహారాజు మహారజతాసనాసీనుఁడై మహారాజవైద్యశిఖామణి యగు నాకొండి రామయ్యగారికి భూదానశాసనమును బంగరుపళ్లెరమునఁ బుష్పతాంబూలములతో నుంచి



కూరుచుండియు రవంత వంగి యెట్లందించుచున్నారో యతిపర్వముగ నాలోకించుచున్నారా? అనేకలక్షలకుటుంబములను బోషించు నత్యంతవితరణశాలి యగు మహారాజును భయంకరమృత్యుదంష్ట్రలనుండి యట్టె యీడఁదీసి బంధులోకమునకు, నాశ్రితలోకమునకు, విద్వల్లోకమునకు, నర్థిలోకమునకు, శూరలోకమునకుఁ దిరుగఁ బ్రసాదించిన మహారాజవైద్యశిరోమణి యగు రామయ్యగారు వంగి చేతులుచాచి దోసిలొగ్గి యాశాసనమును గ్రహించి యెట్లు కనుల కద్దుకొనుచున్నారో పరిశీలించితిరా? ఆహా! ఈసన్నివేశమున నొడలు పులకించుచున్నదే! ఆమహారాజునకుఁ దండ్రులు తాతలు ముత్తాతలు నగు మహాప్రభువులు గోడలపైనుండి “మావంశమును నిలువఁబెట్టి పుణ్యముసు గట్టుకొంటి రయ్యా" యని పల్కుటకుఁ గాఁబోలు రవంత విడినపెదవులతో దయార్ద్రములగు నిశ్చలదృష్టులతోఁ గృతజ్ఞతాసూచకములగు మందహాసములతో రామయ్యగారివంక నెట్లవలోకించుచున్నారో చూచితిరా! విద్యావంతుఁ డగువానిబ్రదుకే బ్రదుకు. అట్టివిద్వాంసు నాదరించుప్రభునిబ్రదుకే బ్రదుకు.

ఈరెండవశాసనము రామయ్యగారిపుత్రునకు శ్రీదంతులూరి జగన్నాథరాజుగారిచ్చిన భూదానశాసనము. ఈశాసనములు రెండు నచ్చొత్తింపఁబడి గ్రంథాదియందే చేర్పఁబడి

నవి. వానిని జూచినపిమ్మటనే పాఠకులు గ్రంథమును బరిశీలింపవలయును.

ఈగ్రంథకర్త మామగారగు బ్రహ్మశ్రీ ఆకొండి రామమూర్తిశాస్త్రిలుగారిని నేను బాగుగా నెఱుఁగుదును. ఈయన యసాధారణమేధాశాలి. సంస్కృతాంధ్రసాహితీసంపన్నుఁడు. ఆయుర్వేదవిద్యావిశారదుఁడు. అగదంకారుని కుండవలసిన యనేకలక్షణములు లీయనయందుఁ బ్రకాశించుచున్నవి. ఈయననాడీనిదానమునుగూర్చికూడఁ గొన్నిచిత్రకథ లున్నవి. మేనమామగా రేమనుకొందురో యని సందేహించి గ్రంథకర్త యాకథలను వ్రాయ మానియుండును. పూర్వులఁ గూర్చి చిత్రకథలను వ్రాసినగ్రంథకర్త యాధునికునిగూర్చి యుపేక్షించుట తగదు. నా కభ్యంతరము లేదు కావున నొకటి రెండు కథలను నేను జెప్పెదను.

కాకినాడలో నొకసంపన్నగృహస్థునియింట నొకనికి వ్యాధికలిగినది. పేర్లతోఁ బనిలేదుకావున విడిచెదను. రామమూర్తిశాస్త్రిలుగా రారోగినాడిని బరీక్షించి యావ్యాధికిఁ దగినమందులు తనయొద్ద లేవని యూరకుండెను. మీ రేల మందిచ్చుటకు నిరాకరించినా రని మిత్రులు కొంద ఱాయనను రహస్యముగ నడుగ “వ్యాధి కుదురునది కాదు, మందీయఁ బనిలేదు. ఈదినము మొద లిరువదితొమ్మిదవదినమునం దాతనికి మృతి సంభవించు” నని శాస్త్రిలుగారు చెప్పిరి. కాని



యాంగ్లేయవైద్యమునఁ గ్రమముగా నారోగికి రోగము కుదిరినది. ఆరోగ్యవంతుఁడై గ్రామమునం దాతఁడు తిరుగమొదలిడెను. “ఇదేమి నాడీనిదానమయ్యా!” యని మిత్రులు శాస్త్రిలుగారిని బరిహసించిరి— “ఇరువదితొమ్మిదవదినము దాఁటినపిమ్మటఁ బరిహసింపవచ్చును గాని యింతలోఁ దొందరపడెద రేల” యని శాస్త్రిలుగారు ప్రత్యుత్తరమిచ్చిరి. మొద్దు లాగునఁ దిరుగుచున్న వానివిషయమై చెప్పినయీమాటలయందు విహితులకైన విశ్వాస ముండునా? ఇరువదితొమ్మిదవ దినము వచ్చినది. ఆయుదయముననే యారోగమే తిరుగఁబెట్టినది. ఆదినమందే యారోగికి మృతి సంభవించినది.

ఇది యసాధారణనాడీనిదానప్రతిభ కాదా? రోగిమణిబంధమునఁ జేయివైచుటతోడనే యాతనిరోగ మసాధ్య మని కనిపట్టుట యెంతవైద్యవిద్యావిశారదునకు సాధ్యమో చెప్పవలయునా? ఒకటిరెండుదినములకు రాఁబోవుమృతిని గనిపట్టు వైద్యులు కొంద ఱున్నారు. చాలమందివైద్యు లదికూడఁ జెప్పఁజాలరు. సగముచచ్చినతరువాతఁగూడ “ఇంజెక్షను” లిచ్చినవైద్యు లెందఱు లేరు. అట్టుండ నిరువదితొమ్మిదిదినములకు రాఁబోవుమరణమును గనిపట్టుట మహాభిషక్ప్రతిభాలక్షణ మనుట కేమైన సందేహమా?

మఱియొకకథ:—ఒకస్త్రీకి ఛర్ది కలిగినది. అది యెన్నిసంవత్సరములో యామెను బాధించినది. రామమూర్తిశా

స్త్రిలుగా రామెనుజూచుసరికి వమనము మహాభయంకరముగ నుండెను. పెండలపుమంప కుమ్ములోఁ బెట్టి పెసరగింజంత మాత్రిచేసి దానిని, మాటలసందడి నామెనాలుకప్రక్కను రామమూర్తిగారు జాఱవిడిచి, యేవో విచిత్రవార్తలచే నామె కు వినోదమును గలుగఁజేయుచుండెను. ఛర్దిరోగిదృష్టిని జమత్కారముగ రోగచింతనుండి మఱలించుట వమనమున కొక విధమగు మందుకట్టు. నాకనుభవములో నున్న యొకచిన్న యంశమును జెప్పెదను. ఒకరోగికి విధివిరామములేకుండ వమనములు వెళ్ళుచుండెను. వైద్యుఁ డొకఁ డాతనికి మందిచ్చుటకు వచ్చి మిక్కిలి దగ్గఱగాఁ గూరుచుండెను. "ఓ"క్కని రోగి యనఁగనే వైద్యుఁ డచ్చటినుండి కదలక, "నాబట్టలెంతశుభ్రముగ నున్నవో చూడుము. వీనిమీఁద వమన మొనర్చుట నీకు మంచిదా" యని ప్రార్థనలో బింకమును గానఁబఱచుచుఁ బలికెను. ఆవైద్యుఁ డక్కడఁ గూరుచుండినంతసేపు రోగి తిరుగ "నో"క్కనలేదు. ఛర్దిరోగిచుట్టు పూలదండలు ఫలములపళ్ళెరములు పవిత్రములగుబొమ్మలు మొదలగునవి యుంచుట యాచారము. ఈయాచారమున కర్థము లేక పోలేదు. అప్రశస్తస్థలమునఁగాని మలమూత్రము లెట్లురావో వమనముకూడ నట్లురాదు.

ఈమాటలకేమి? పెండలపుమాత్ర నోటఁబడినయామె వైద్యునిమాటలను నిశ్చలదీక్షతో వినుచునేయున్నది. నోటి



లోమాత్ర నోటిద్రవముతోఁ గలసి రోగియెఱుఁగకుండ గొంతుకలోనికిఁ బోవుచునేయున్నది. ఆరోగిచేతనే రామమూర్తిశాస్త్రిలుగారు రెండుదినములలోఁ బట్టెడు పెండలపు దుంపను దినిపించిరఁట—

నాడీనిదానమున కొకకథ చెప్పితిని. వైద్యక్రియయందలి చాకచక్యమున కొకకథ చెప్పితిని. స్థాలీపులాకన్యాయముగా నింతటితోఁ జాలును. అనేకమహావైద్యు లసాధ్యములని విడిచినవ్యాధుల నీయన కుదుర్చుట నాయనుభవములో నున్నది. పేళ్లవసరములేదు. కాకినాడవారిపేళ్లు చెప్పినప్పుడు పిఠాపురపువారి వేల చెప్పవలయును? ఈయన తనవంశములోని పూర్వభిషగ్వరుల కెంతమాత్రమును దీసిపోరు.

అల్పవిద్వాంసు లన్నివృత్తులకుఁగూడ నప్రతిష్ఠ తెచ్చుచున్నారు. అందులో వైద్యవృత్తిలోని యల్పజ్ఞానమువలన నప్రతిష్ఠమాట యటుండఁగా నపారమగు ప్రాణినాశనము కలుగుచున్నది. పాత్రౌచిత్యములేని నాటకమువలనఁ గవికప్రతిష్ఠయే కాని పాఠకున కొరగాలునొప్పియైనఁ గలుగదు. కాని పాషాణశుద్ధిలేని రామబాణమువలన రామబాణముచే వలెఁ బ్రాణినాశనము తప్పదు. శారీరశాస్త్రమర్మ మెఱుఁగని చిత్రకారుని చిత్రమువలన ద్రష్టకు నెత్తిపై వెండ్రుకయైన నూడదు కాని శారీరశాస్త్రజ్ఞానశూన్యుఁడైన వైద్యునిమాత్ర వలన రోగికి నరములపట్లన్నియుఁగూడ నొక్కసారి యూడి

పోవును. ఆపలయ మున్న గాయకునిగీతమువలన శ్రోతకుఁ జెవిలో రవంత నొప్పియైనఁ గలుగదు కాని పైత్యజ్వరమును వాతజ్వర మని భ్రమపడి వైద్యుఁ డిచ్చిన వాతరాక్షసము వలన రోగికి బ్రహ్మరంధ్రమునఁ జోటుపుట్టుట నిశ్చయము. ఇట్లర్ధవిద్వాంసులు నల్పవిద్వాంసులు నజ్ఞులు నగువైద్యుల వలన నెంతప్రాణిబాధయైన నెంతప్రాణినాశన మైనఁ గలుగుచున్నది. వైద్యశాస్త్రజ్ఞానవిషయకములగు యోగ్యతాపత్రములు లేకుండ నితరదేశములందు వైద్య మొనర్చుట కవకాశము లేదు. అట్టిప్రతిబంధము మనకు లేకుండుటచే జ్ఞానహీనులగు వైద్యులా వృద్ధియగుచున్నారు. అదృష్టహీను లగు రోగులమృతులా వృద్ధియగుచున్నవి. ఇంతభయంకరసన్నివేశ మితరదేశములందు గలుగుట కవకాశమున్నదా? మనదేశము కావున, మనజాతికావున నజ్ఞవైద్యుల యవకతవకయాటలన్నియు సాగుచున్నవి. అభాగ్యరోగుల యపరకర్మము లంతులేకుండ సాగుచున్నవి. కర్మసూత్రప్రాబల్యమును నమ్మినయట్టి మనము కంటిలోఁ జెముడుపాలుపోసిన వైద్యుని నిందింతుమా? కాటి కేఁగిన రోగినిగూర్చి చింతింతుమా? రావలసినది రాకతప్పదు; పోవలసినది పోకతప్పదు; కావలసినది కాకతప్ప దని గాఢమైన విశ్వాస మున్నప్పుడు "వైద్యుఁ డేమి చేసినాఁడు. మనకర్మ మిట్లున్నది. రోగి కాయువులే" దని మనలో మన మూఱటఁ జెందకుండుట కవకాశ మున్నదా?



మన కట్టివిశ్వాసమే లేకుండునెడల నజ్ఞవైద్యు లొనర్చుచున్న దుర్వైద్యములకు వారు మనప్రాణములతోఁ జేయు చెరలాటములకు వారితెగనీల్గుదనములకుఁ బ్రతిఫలముగా ఖల్వములతో నంచికట్లతోఁ జేతిముడ్లతో వారి నందఱను గట్టకట్టి భారతదేశపీడ వదలునట్లు బంగాళాఖాతములోఁ బాఱవేయకుందుమా?

వైద్యజ్ఞాన ముండి, దైవభక్తి యుండి, ప్రజాహిత తత్పరత యుండి, పాపభీతి యుండి, దురాశాదూరత యుండి, దయార్ద్రచిత్తత యుండి చేయువైద్యవృత్తికంటెఁ బుణ్యతరమైనవృత్తి వేఱొకటి ప్రపంచమున లేదు. అవి లేకుండునప్పు డావృత్తికంటెఁ బాపతరమైనవృత్తి వేఱొకటి లేదు. కటికవానివృత్తికూడ నంతకంటె మంచిది. కాకయని భ్రమపడి మఱింత చలువలోనికి దింపి, చలువ యని భ్రమపడి మఱింత కాకలోనికి దింపి యటుగుంజి యిటుగుంజి సర్వబాధలుపెట్టి తుదకు రోగిని నేలకు దింపువైద్యుఁ డొక్కకత్తివ్రేటుతో జీవనాశన మొనర్చుకటికవానికంటెఁ గఠినుఁడుకాఁడా?

ఆయుర్వేదాభ్యసనమున కిప్పు డున్నపాఠశాలలలోఁ జదివి, చదువుపూర్తిగావించి, పిమ్మటఁ గొంతకాల మాకొండి రామమూర్తి శాస్త్రులువారివంటివారియొద్ద సహాయుఁడుగాఁ బనిచేసి యనుభవమును సంపాదించి, యటుపిమ్మట స్వతంత్రముగా వైద్య మారంభించి, సందేహాంశములందుఁ బెద్దలసాహాయ్య మపేక్షించుచుఁ బాపభీతి కలిగి, ప్రజారోగ్యప్రదాన

నిపుణులై ప్రకాశించుట యిప్పటిబాలురలో ననేకులకుఁ గర్తవ్యము. ఒకనిని బాధపెట్టి తాను సుఖపడుటకంటెఁ దాను బాధపడుట మంచిది. ఒకనిని జంపి తాను బ్రదుకుటకంటెఁ దాను జచ్చుట మంచిది. రాజ్యాంతే నరకంధ్రువ మ్మను మాటలోకంటె, వైద్యాంతే నరకంధ్రువ మ్మనుమాటలో నెక్కువ సత్యమున్నది. ఒక్కచాతుర్మాస్యములో వైద్యుఁడు తీసినన్ని ప్రాణము లెంతరాజైన నొక్క సంవత్సరములోఁ దీయఁగలఁడా? అదిగాక యాశ్రయించినవారిప్రాణముతీయుట లోను విరోధిప్రాణమును దీయుటలోను నెంత భేదమున్నది?

Surgery (శల్యతంత్రము) మనకు లేదని పాశ్చాత్య వైద్యు లాయుర్వేదము నధిక్షేపించుచున్నారు. ధారానగరాధీశ్వరుఁడైన భోజమహారాజునకు మెదటిలో కంతివంటిది బయలుదేఱిన దనియు, నాయుర్వేదవైద్యసోదరు లిద్దఱా మహారాజునకు సమ్మోహిని యనునోషధివలన మత్తుకలుగఁజేసి, పుఱ్ఱెపెంకు దీసి, లోనికంతినిగోసి తిరిగి పెంకును యథాస్థానమున నుంచి కుట్టి సంజీవిని యనునోషధిచే మహారాజునకుఁ బ్రజ్ఞ కలుగఁజేసి యాతని నారోగ్యవంతుని జేసినట్లు, వ్రాఁతమూలములగు నిదర్శనములతో విమర్శకు లిప్పుడు కనిపట్టియున్నారు. ఈయద్భుతమైన శల్యతంత్రచికిత్స 927 వ సంవత్సరమున—సరిగా వేయిసంవత్సరములక్రిందట జరిగినది. పాశ్చాత్యదేశస్థులలో ననేకులు నాగరకత యన నేమో యె



ఱుఁగనప్పుడు, కడుపునొప్పి గలిగినపిల్లి గడ్డిఁగొఱికి క్రుక్కొన్నంత వైద్యజ్ఞాన మైన లేక యుండునప్పుడు శల్యతంత్రశాస్త్రజ్ఞానపరమావధిచిహ్నమైన యీచికిత్స చేయఁబడినది.

ఆయుర్వేదములో శాస్త్రీయమైనవైద్యము లేదనియు, నున్నదేదియో నాచరణమున కక్కఱకురా దనియుఁ బాశ్చాత్యు లభిప్రాయపడుచున్నారు. ఆయుర్వేదమున కిట్టియపకీర్తి యజ్ఞులగు వైద్యులమూలమునఁ గలిగినదే. ఆకొండివారికుటుంబమువంటి కొన్నికుటుంబములుమాత్రమే యీయాయుర్వేదప్రాశస్త్యము నింకఁ జాటుచున్నవి. ఇట్టియనేకకుటుంబము లింక బయలుదేఱవలయును. ఇద్దఱుకొడుకులున్న ప్రతిగృహస్థుఁడు కూడ నొక్కకొడుకు నాయుర్వేదవైద్యునిగఁ జేయుట మంచిది. ఏవృత్తికైన నెప్పటికైనఁ దఱుగువిఱు గుండవచ్చునుగాని వైద్యవృత్తి కెన్నఁడు నట్టివి లేవు. ఎట్టియారోగ్యవంతునికైన సరే యేదో యొకజబ్బున్నది కాని లేకపోలేదు. సంపూర్ణారోగ్యవంతుఁడైనవాఁడు ముందుసృష్టిలోనివాఁడేమో కాని యిప్పటివాఁడు కాఁడు. శరీరమున్నంతకాలము మనుజుఁడు వైద్యవృత్తి నాశ్రయించి యుండకతప్పదు. ప్రళయమువఱకు నలితొల లేకుండ మాపు మచ్చ లేకుండ దినదినప్రవర్ధమానముగా నిల్చియుండఁగల దొక్క వైద్యవృత్తియే. అందుచే దీనివలన ధనమూ హెచ్చు. జనగౌరవమూ హెచ్చు. పరోపకారావకాశమూ హెచ్చు.

ఇప్పు డాయుర్వేదమునకు మంచిదినము లారంభ మైనట్లు కనఁబడుచున్నది. దేవభక్తి కలిగి, దేశభక్తి కలిగి, పూర్వర్షులయందు గౌరవము కలిగి, యార్తత్రాణమునం దాసక్తి కలిగి, యాయుర్వేదమును బఠించి యనేకయువకులు లోకకళ్యాణమునకుఁ దోడుపడుదురుగాక! ఆయుర్వేదాధిక్య మెట్టిదో సాక్ష్యుపన్యాసములలో రెండవసంపుటమున జంఘాలశాస్త్రి చెప్పియున్నాఁడు. దానిని దప్పకుండఁ జూడవలయును.

ఈగ్రంథమును రచియించిన శ్రీ మధునాపంతుల సత్యనారాయణగారు ఆకొండి రామమూర్తిశాస్త్రులుగారి యల్లుఁడు శిష్యుఁడు నాకు మిత్రుఁడు. ఇతఁడు మామగారిచాయ ననుసరించి వైద్య మొనర్చుచున్నాఁడు. ఈతనిని భగవంతుఁడు దీర్ఘాయురారోగ్యైశ్వర్యాదిసమృద్ధి నిచ్చి రక్షించుఁగాక.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

పానుగంటి లక్ష్మీనరసింహారావు.

మొహరు

కృష్ణా

విజయనామ సంవత్సర జ్యేష్ఠ బ ౧౧ గురువాసర ము॥న శ్రీవేదమూర్తులగు ఆకోండ్డి కామన్నగారికి శ్రీరాజా దంత్తులూరు జగన్నాథరాజుగారు వ్రాయించి యిప్పించిన భూదానధర్మశాసనపట్టా— మాజమీందారీ ముతే తాణే అంకతా॥ మ॥ పోలవరంలో మేము కట్టించ్చిన అగ్రహారములో వక నివేశంలోగిలి మీకు కాపురంకింద్ను యిప్పించ్చి యీగ్రామంలో మీకు పల్లె ఖ ౧ పల్లెపుట్టిడున్నూ మ॥ కొత్తపల్లెలో పల్లె ఖ ౧ పల్లెపుట్టిడును వెరసి పల్లె ఖ ౨ పల్లె రెండుపుట్లభూమి శ్రీ అర్పణముగా మాన్యంయిప్పించ్చి పట్టా వ్రాయించ్చి యిప్పిస్తిమి గనుక సదరహిభూమి విర్విగా ఫలపర్చుకొని మేము యిప్పించ్చిన లోగిట్లో కాపురంవుండ్డి అంద్దులఫలం మీపుత్రపౌత్రపారంపర్యం అనుభవిస్తూ సుఖాన వుండ్డుకొనవలెను. స్వదత్తాద్విగుణంపుణ్యం పరదత్తానుపాలనం.

(ఇంగ్లీషు పొడి అక్షరములున్నవి.) } { (ఇచ్చుటదస్కతు మొహరువలె నున్నది)

శ్రీ॥ జగన్నాథరాజుగారు (అని ఉన్నది) (ఇంగ్లీషు పొడిఅక్షరములున్నవి.)

శ్రీరామా

మొహరు

పట్టాభిరామా

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశకాబ్దంబ్బులు ౧౬౭౩ అగు నేటి శ్రీఖరనామసం॥ వైశాఖ శు ౧౦ బుధవారం శ్రీవేదమూర్తులయ్ని ఆకోండ్డి రామయ్యగారికి రాజే వత్సవాయ జగపతిరాజు మహారాజులుంగారు వ్రాయించియిచ్చిన భూదానధర్మశాసనపట్టా— మాజమీందారీ వింజ్జరం మురుమళ్లసీమల తాలూకు కేశ్నకుర్తి పల్లె ఖ ౪ పుట్లభూమి మీకు మాన్యం యిప్పించ్చి శ్రీ అర్పణంగ్గా యీపట్టా వ్రాయించ్చి యిప్పింత్సడమైనది గన్కు సదరహి భూమి విరివిగా ఫలపర్చుకుని యిందులఫలం మీపుత్రపౌత్రపారంపర్యం సుఖాన అనుభవిస్తూవుండ్డవలెను. స్వదత్తాద్విగుణంపుణ్యం పరదత్తానుపాలనం.

అస్పష్టమైన ఇంగ్లీషువ్రాలు } { శ్రీవారిదస్కతు (మొహరువలె నున్నది)

శ్రీ

# ఆకొండివారి వైద్యము.

శ్లో. అగ్నివేశమునిప్రోక్తం । చరకాచార్యసంస్కృతం
ఆత్రేయభగవల్లబ్ధ । మాయుర్వేదముపాస్మహే.

మనయాంధ్రదేశమునఁ బెక్కుమండలములయందు-- అందును విశేషించి కృష్ణాగోదావరీమండలములయందుఁ జిరకాలమునుండి నేఁటివఱకును "ఆకొండివారివైద్యము" సుప్రసిద్ధమై సుప్రశస్తమై యున్నసంగతి బహుజనులకు సువిదితమైన విషయమే. ఈయాకొండివారివైద్యమున కింత ప్రసిద్ధిప్రాశస్త్యములు కలుగుటకు ముఖ్యకారణము లేవని విచారించినచో నొకటి ప్రాచీనత, రెండు తద్వంశ్యుల సద్గుణసామర్థ్యాదిసంపత్తియు నని చెప్పవలసియున్నది.

## ప్రాచీనత.

ఆకొండివారి వైద్యప్రాచీనత మిక్కిలి వింతయైనది; కావునఁ బాఠకుల వినోదమునిమిత్తమై యీాదిగువఁ దద్వృత్తాంతము గొంత యుదాహరించుచున్నాను.

గోదావరీమండలమున నములాపురము తాలూకాలో "కేశనకుఱ్ఱు" అనెడు నొకగ్రామ మిప్పటికిని 'వ్యాసకాశి' యనుపుణ్యక్షేత్రముగాఁ బరిగణింపఁబడుచున్నది. పూర్వకాలమునఁ గృష్ణద్వైపాయనుఁడు వారాణసిపైఁ గోపించి వచ్చి

యిచ్చుట మఱియొక కాశీక్షేత్రమును నిర్మింపఁదలపోసి తత్ప్రయత్నమును దీక్షవహించి యుండఁగా నింద్రాదిత్రింశత్కోటి దేవతలును బ్రహ్మదేవుని బురస్కరించుకొని వచ్చి వ్యాసమహర్షి ననునయించి భూలోకమున ముక్తిక్షేత్రమగు కాశికిం బ్రతికాశిని నిర్మించినచో నామహాక్షేత్రము గౌరవముచెడును గావున ననుగ్రహించి "కాశీం నకురు, కాశీం నకురు" అని నివారించిరఁట! నాఁటిమొదలు "కాశీం నకురు" అనువాక్యము జనపరంపరాముఖోచ్చారితమై వర్ణలోపవర్ణాగమవర్ణవ్యత్యాసములవలన మార్పుఁజెంది "కేశనకుఱ్ఱు" గా వికృతిఁ జెందెనని కొందఱు పెద్దలు చెప్పుదురు. ఇది యెంతవఱకు విశ్వసనీయమైనదో మన మిప్పుడు విచారింపవలసిన యవసరములేదు; కాని "కాశీం నకురు" "కేశనకుఱ్ఱు" గా మాఱెనదని చెప్పిన బుద్ధిమంతుని యుక్తికి సంతసింపవలసియే యున్నది. ఆకొండివారిపూర్వు లెప్పు డెక్కడనుండి వచ్చిరో కాని యతిప్రాచీనకాలమునుండి, యేతద్గ్రామవాస్తవ్యులై యున్నట్లు చాల నిదర్శనములు గలవు. నా తెలిసినవిషయమును వ్రాయుచున్నాను.

నే నాకొండివారి దౌహిత్రుఁడను, శిష్యుఁడను గావుటం జేసి వారు రహస్యముగాఁ గాపాడుకొనుచున్న వైద్యగ్రంథముల (తాళపత్రప్రతులను) నే నొకప్పుడు చూచుభాగ్యము లభించినది. వానిలో నొకగ్రంథరాజము నా కమూల్య



మైనదిగా గోచరించినది. దానిం జూచునప్పటికి నా కమితానందము గలిగి కొంతసేపటివఱకు నిశ్చేష్టుఁడనై యుండి యావంశస్థుల జాగ్రత్తకును వారి ప్రతిభావిశేషములకును మిగుల నాశ్చర్యము నొందుచు దానిని సమగ్రముగాఁ బునఃపునఃపఠనము గావించి చూచితిని. అందలివిశేష మేమనఁగా— ఆకొండివారి బహుపురాతనమైన వంశవృక్షమును, దానియం దిప్పటి కిరువదియొకటవ పురుషునియొద్దనుండియు వైద్యవృత్తి పారంపర్యముగా వచ్చుచుండుటయును, ఆయాపురుషు లెప్పుడెప్పు డేయేవిషయముల నొనర్చినదియు నెక్కడెక్కడకు వెళ్లినదియు నేయే విధముగా మాఱినదియు నెవ్వ రెవ్వ రేయేరోగముల నేయేవిధముగ నివారించినదియు, రోగములయొక్క సాధ్యత్వాసాధ్యత్వములును, మున్నగువిశేషములు విస్పష్టముగ వ్రాయఁబడియున్నవి. దానిని నాకు మేనమామగారైన రామమూర్తిగారియొద్దకుఁ గొనిపోయి యిట్టియమూల్యగ్రంథమును లోకోపకారార్థ మేల ప్రకటింపక రహస్యముగా నుంచితిరి. నా కిప్పించిన నేను బ్రకటించెద నని కోరితిని. అందులకు వారు దీనిం బ్రకటించుటకుఁ బెద్దలయనుమతి లేదనియు,

శ్లో. ఆయు ర్విత్తం గృహచ్ఛిద్రం మంత్ర మౌషధ సంగమౌ
దాన మానావమానాని నవ గోప్యాని కారయేత్.

అను నార్యోక్తినిబట్టి దీనిని రహస్యముగా నుంచుట దోషము కా దనియు వారు సెలవిచ్చిరి. నే నంతటితోఁ దృప్తినొందక

నేను వారివలన నేర్చుకొన్న వైద్యవిద్యకుఁ బ్రతిఫలముగాఁ దద్వంశీయుల చరిత్రమైన వ్రాసి కృతజ్ఞతఁ జూపినవాఁడనగుదునని వారిమిత్రులు పెక్కండ్రుచేఁ జెప్పించి యెట్టకేలకుఁ బ్రస్తుతము చరిత్రాంశములనుమాత్రము ప్రకటించుట కంగీకరింపఁజేసి యాపుస్తకమునకుఁ బుత్త్రికను సంపాదింపఁగల్గితిని. దానియందలి వైద్యవిషయములను గాలాంతరమందుఁ బ్రకటింపఁ దలంపు గలదు. ఇప్పుడు ముందుగాఁ జరిత్రాంశములనుమాత్రమే వ్రాయుచున్నాను.

ఆకొండివారివంశ్యులలో నీపుస్తకమునం దున్న వంశవృక్షమునందలి ప్రధానపురుషుఁడు నారాయఁడు. ఈయన కేశనకుర్తివాస్తవ్యుఁడే.

ఈయనమొదలు సప్తపురుషాంతరములవఱకు నీవంశ్యుల కింటిపేరు నాకు లభించినపుస్తకమువలనఁ దెలియరాలేదు. అంతవఱకు వీరిచరిత్రాంశములుగూడ విశేషముగా గోచరింపవు. ఎనిమిదవపురుషుఁడు “ ఆకొండాయ ” యనునతఁ డున్నట్లు వంశవృక్షమువలనఁ దెలియుచున్నది. ఆకొండాయ మొదలుకొని వారివారి స్వీయవిషయములు వ్రాసికొనునప్పు డెవ్వియో కొన్ని విచిత్రరోగములయొక్క సాధ్యత్వాసాధ్యత్వములు, ననుభూతములైన సూక్ష్మౌషధప్రక్రియలును వ్రాయఁబడుచుండుటచే నప్పటినుండి చికిత్సానైపుణ్యము వారివంశమునఁ బ్రకాశించుచు వచ్చుచున్నట్లు తోఁచుచున్నది.



ఈగ్రంథమున కనుబంధముగా ముద్రింపఁబడిన వంశవృక్షమును జూచినయెడల మూలపురుషుఁడైన నారాయణున కెనిమిదవ పురుషుఁడు “ ఆకొండాయ ” యను నతఁ డుండెననియు నాతనివృత్తి వైద్య మనియు స్పష్ట మగుచున్నది. ఈయాకొండాయనుబట్టియే యాకొండివారికి గృహనామ మేర్పడినట్లు తోఁచుచున్నది. మనయాంధ్రదేశమున నొకవ్యక్తికిఁ జేయు నామకరణముల కన్నిటికిని సరియగు వ్యుత్పత్తి నిర్ణయించుట మిక్కిలి కష్టము. పుల్లయ్య యెల్లయ్య యిత్యాది నామముల కర్థవివరణము చేయుట శక్యముగానిపని, కాని కొన్నినామములు కొంచెము విమర్శబుద్ధితోఁ బరిశీలించినయెడల నర్థవంతములుగా సమర్థింపవచ్చును. ప్రస్తుతము మన యాకొండాయ నామమును గొంత విచారించిచూతము:—చెన్నరాజధానిలోఁ జాలఁగాలమునుండి “ కలౌ వేంకటనాయకః ” అను నమ్మకముతోఁ గలికాలమున శ్రీతిరుమల వేంకటేశ్వరుఁడే దైవ మని యెంచుచుండుట గలదు. పెక్కుచోట్ల నాదేవునకు సంబంధించిన నామములే పెక్కండ్రకు కలవు. వెంకప్ప, కొండలరాయఁడు, కొండయ్య, వేంకటేశ్వరులు, వేంకటాచలపతి, యేడుగొండలు, తిరుమలయ్య, శ్రీగిరి, మొదలైన నామధేయము లనేకస్థలములయందు మిక్కిలి వాడుకలో నుండుట మనకు విదితము. ఇవి యన్నియు వేంకటేశ్వరపర్యాయములుగాఁ జెప్పవచ్చుటకు సందేహము

లేదు. మన యాకొండాయ పేరుగూడ వేంకటేశ్వరపర్యాయముగా నెన్నవలసి యున్నట్లు తోఁచుచున్నది. దీనికి నాకుఁ దోఁచిన యర్థము:—

కొండ+అయ్య=కొండయ్య. ఆ+కొండయ్య. దీనినే యాకొండాయ యని వాడుచువచ్చిరేమో! ఆ=ప్రసిద్ధమైన కొండయ్య. కొండఱేఁడు. కొండ కధిపతి. (శేషాచలాధిపతి) అని—

ఇంతకు వేఱొండు వ్యుత్పత్తి యున్నయెడల బుద్ధిమంతు లూహించి తెలిపినచోఁ గృతజ్ఞతాపూర్వకముగా గ్రహించి ప్రకటించుకొందును.

ఆకొండాయతరువాతనుండి యాతనిపేరఁ దద్వంశస్థుల కాకొండాయవా రని పేరు వచ్చి క్రమక్రమముగా వాడుకలో మాఱి ఆకొండవా రనియు, "ఆకొండివా" అనియు నేర్పడినట్లు చెప్పినయెడల యుక్తియుక్తముగా నుండునేమో యని తోఁచుచున్నది. పాఠకు లిదియే సిద్ధాంతముగాఁ బరిగణింపఁగూడదు. ఏల యన. ఆంధ్రదేశవాస్తవ్యులలోఁ గొందఱివంశములకు గ్రామనామములుకూడ నుండుట సుప్రసిద్ధము. ఆలమూరివారు, రేపాకవారు, కాకరపర్తివారు, పూర్లవారు, ఖండవిల్లివారు, ఇత్యాదులీజాతిలోనివే. కావున "ఆకొండి"యని పూర్వమేదైన గ్రామ మెచ్చటనైన నుండి తద్గ్రామనామముచేతనైనను వీరివంశమున కీపేరు వచ్చియుండవచ్చును.



ఇట్లు గృహనామ మేర్పడినతరువాత రానురాను మఱికొంతకాలమున కీవంశమువారికి నారాకొండివా రని పేరు వచ్చినది.

ఇందులకుఁ గారణము మూలపురుషుఁడు నారాయఁడగుటచేతనో లేక యీవంశమువారిలోఁ దఱచుగా నారాయఁడు, నారప్ప మొదలగు పేర్లు గలపురుషు లుండుటచేతనో యిట్టివాడుక వచ్చియుండవచ్చును. అటుపిమ్మట మఱికొంతకాలమున కీవంశస్థులలోనే కొందఱికుటుంబములకు వ్యాసాకొండివా రనియు, కామాకొండివా రనియు, వాడుకగలిగినది. ఇందు కామాకొండివారి కట్టివాడుకవచ్చుట కొకవింతయైన కథ యున్నది. అది పాఠకులవినోదార్థ మిం దుదహరింపఁబడుచున్నది.

## —♦ కామేశ్వరి కథ ♦—

వంశవృక్షమునందలి యాకొండాయకుఁ దొమ్మిదవ పురుషుఁడైన నారప్ప యనునతఁడు గొప్పవైద్యుఁడై యుండెను. ఆతఁ డొకప్పు డెచ్చటనో రాజాస్థానమున వైద్యము చేయుటకుఁ బల్లకి నెక్కి వెళ్లుచుండఁగా నది మండువేసవి యగుటచే బోయలు డప్పిగొని యొకచెఱువుగట్టున నున్న యొకమఱ్ఱిచెట్టు నీడ నాపల్లకి దించి వారు చెఱువులో నీరుద్రాగుటకు వెళ్లియుండఁగాఁ బల్లకిలో నిద్రించుచున్న నారప్పకు స్వప్నమున సర్వాలంకారభూషితయై సుందరి యగు నొకకన్యక గాన్పింప

నాతఁడు విస్మితుఁడై ‹‹ అమ్మా! నీ వెవ్వరవు. ఇచట నొం
టిగా నుండుట కేమి హేతు వని నిదురలోనే ప్రశ్నింపఁగా
నప్పు డామె మందస్మితసుందరవదనారవిందయై నాయనా! నేను
గామేశ్వరి యను దేవతను, నీవు దైవభక్తిసంపన్నుఁడవును
బరోపకారపరాయణుఁడవు నని తెలిసికొని నీకు దర్శన మిచ్చి
తిని; నీవు రాజాస్థానమున వైద్యము చేయుటకుఁ బోవుచు
న్నావు. నీయమృతహస్తప్రభావమున రోగికిఁ దత్క్షణమే సం
పూర్ణారోగ్యము కలుగును. నీకు మంచిలాభము చేకూరును;
నీవు వైద్యము చేయఁబోవుచోట నటుకపైఁ బ్రాంతబడియున్న
నాయుయ్యెలస్తంభము లున్నవి; నిన్ను వారు సత్కరించు
సమయమున నాయుయ్యెలస్తంభములనుగూడ నడిగిపుచ్చు
కొని తెచ్చి మీయూరఁ జెఱువుగట్టుపై నున్న యొకవేఁపచెట్టు
క్రింద నాయుయ్యెలస్తంభముల నిల్పి నన్ను మీకులదేవతగా
భక్తితోఁ గొలుచుకొనుచుండవలయును; నాయెడల మీకుఁ
గల భక్తికి సూచకముగా మీవంశమునందుఁ బ్రథమసంతా
నమునకు నాపేరు పెట్టుకొనుచుండుఁడు. పరోపకారపారీణ మగు
మీవైద్యమునకు నే నెల్లప్పుడు వన్నెదెచ్చుచు మీవంశక్షే
మమును గాపాడుచుందును. అని చెప్పి వెడలిపోవుచుండఁగా
నారప్ప భయభక్తివినయములతోఁ బాదములపైఁ బడి సాష్టాం
గప్రణామము చేసి ‹‹ అమ్మా! నీమాటలయందు నాకు
విశ్వాసముకలదు గాని నీవు నిజముగాఁ గామేశ్వరి వైనట్లు



నాకు మఱియొక తార్కాణముఁ జూపింపఁగోరుచున్నాను.
నే నిట్లడిగినందులకు క్షమింపు మని ప్రార్థించెనఁట.

అది విని యామె, సరే! నీ విప్పుడు పల్లకిపైఁ బోవ
నుంటివి గదా! బోయలు వచ్చినతరువాత ముందువైపున
నున్న పల్లకిదండినిమాత్రమే బోయలచే నెత్తింపుము. వెనుక
దండిని బోయలు మోయ నక్కఱ లేకుండఁగనే నీ పల్లకి
నడిపించెదను. అప్పుడు నీకు సందేహనివృత్తి కాఁగల దని
చెప్పి యంతర్ధాన మొందినదఁట. అంతట నారప్ప మేల్కాంచి
యిది యంతయు నిజ మగునా యని యాశ్చర్యము నొందుచు
సంపూర్ణదృష్టాంతముకొఱకు బోయలు వచ్చినతరువాతముందు
వైపునమాత్రమే పాలకి నెత్తుట కాజ్ఞాపించెనఁట. అప్పుడు కా
మేశ్వరీప్రభావముచే వెనుకవైపున బోయ లక్కఱలేకుండఁ
గనే పల్లకి లేచెనఁట. అట్లు పదిబారలదూరము పోయి యథా
పూర్వముగా బోయలచేఁ బల్లకి మోయించుకొని గమ్యస్థాన
మున కరిగి రోగనివారణముచేసి బహుమానము నొంది కామే
శ్వరి చెప్పినచొప్పున వారియటుకపై నున్న యాయుయ్యెల
స్తంభముల నడుగఁగా వారు వానిని వెదకి యిచ్చిరఁట. అం
దుపై నెనిమిది స్త్రీవిగ్రహములును రెండు పురుషవిగ్రహము
లును నుండుట చూచి సంతోషోత్సాహములతో నింటికిఁ
దెచ్చి తమయూర నున్న చెఱువుగట్టుపై వేఁపచెట్టుక్రిందఁ గా
మేశ్వరీప్రతిష్ఠ చేసెనఁట. అదిమొదలు వారియింట నేశుభ

ముతైనను నెక్కడ గొప్పసన్మానమును బొందినను గామేశ్వరిని గొలుచుట యాచారమై నేటివఱకును నవిచ్ఛిన్నముగా జరగుచున్నది. నారప్ప తనకుఁ గలిగిన సంతానమునకుఁ గామయ్య యని పేరుపెట్టెను. అప్పటినుండియే కామాకొండి వారి కాపేరు వచ్చియుండెనఁట. వంశవృక్షమునందుఁగూడ నేతత్కథానుసారముగా నప్పటినుండియే కామనామధేయములు కనుపట్టుచున్నవి.

మఱికొన్ని కుటుంబములవారు కేశనకుర్రునందు వెలసియున్న వ్యాసేశ్వరు నిష్టదైవముగా భావించి తమసంతానమునకు వ్యాసనామములు పెట్టుకొనుచు వ్యాసాకొండివారని వాడుక జెంది యుండవచ్చును. ఎట్లయిన నేమి ఆకొండివారు, నారాకొండి యనియు, కామాకొండి యనియు, వ్యాసాకొండి యనియు, మూఁడుతెగలుగా నేర్పడిరి. పైని జెప్పఁబడిన కామేశ్వరీభక్తుఁ డగు నారప్ప మిక్కిలి ఘనవైద్యుఁడై యనేకరాజాస్థానములలో గౌరవము నొంది విశేషముగు విలువగల యౌషధములు తయారుచేయించి ప్రఖ్యాతి గాంచెను.

ఈతనికుమారులలోఁ బెద్దవాఁడైన రామయ్య శిష్టుకృష్ణమూర్తికవిగారికి సమకాలికుఁడై రాజా జగన్నాధరాజుగారి యాస్థానవైద్యుఁడుగా నుండి వారివలన విశేషసన్మానములు పొందియున్నాఁడు. ఈరాజా జగన్నాధరాజుగారు ఆకొండివారికి ముఖ్యాశ్రయులై వీరి నెక్కుడుగౌరవముతో నా



దరించువారు గాన వీరిసంగతికూడ కొంచెము వ్రాయఁబోవుచున్నాను. వీరితండ్రిగారు దంతులూరి విజయగోపాలరాజుగారు. వీరు పదునెనిమిదిగ్రామములు సంపాదించి పరిపాలించుచుండెడివారు. వారిపుత్త్రులైన రాజా జగన్నాధరాజుగారు "పండితజగన్నాథరా"జను ప్రఖ్యాతి వహించి, బులుసు పాపయ్యశాస్త్రిగారు శిష్టుకృష్ణమూర్తికవిగారు పిండిప్రోలులక్ష్మణకవిగారు ఉప్పులూరి రామచంద్రసిద్ధాంతిగారు మున్నగు మహాపండితుల రప్పించి తమసంస్థానమున వారికి భూవసతుల నిప్పించి సన్మానించిన మహనీయులు.

శిష్టు కృష్ణమూర్తికవివిరచితమైన యీక్రిందిపద్యమువలన రామయ్యగారి వైద్యప్రభావము స్పష్టము కాఁగలదు—

సీ. ధాతుపరీక్షాతిదక్షుండవు మీతాత
రామలింగన్న శ్రీరామకృపను
మీతండ్రి నారప్ప మిగుల సర్వామయ
ధ్వంసనౌషధజాల తత్త్వవేది
రాజా జగన్నాథరాజ సత్కారుణ్య
సంపాదిత సుకీర్తిశాలి వీవు
అఖిలరాజన్య సమాహూయమాన వి
ఖ్యాత యశోధనుల్ నీతనయులు
గీ. భళిర! యాకొండివంశ సంభవులలోన
సచ్చికిత్సాతిచతురుండు సజ్జనుండు

గానివాఁ డొక్కఁడైనను గానఁబడఁడు
భువిని రామయ్య! నీపూర్వపుణ్య మేమొ.

ఈపద్యమునుబట్టి యీతఁడేగాక యీతనితండ్రితాతలును గుమారులునుగూడ వైద్యవిద్యాప్రవీణు లైనట్లు స్పష్టమగుచున్నది. దీనింబట్టి చూచినను నాకు దొరకిన తాళపత్రగ్రంథమునందలి వైద్యప్రశంసనుబట్టి చూచినను వంశవృక్షమునందలి మూలపురుషుఁడు మొదలుకొని యీవంశస్థులలో నందఱును వైద్యులే యైనట్లు తోఁచుచున్నది. ఇంతప్రాచీనకాలమునుండి యొకకుటుంబములో వైద్యపరిచయ ముండుట యొకవింత యైనవిషయమే.

## —♦ ప్రాశస్త్యము ♦—

ఆంధ్రదేశమునఁ దక్కినవైద్యమునకంటె "ఆకొండివారివైద్యము" నం దొకవిధమైన వైలక్షణ్యమును బ్రాశస్త్యమును గల దని పలువు రైకకంఠ్యముతో నొప్పుకొన్న విషయమై యున్నది. పురాతనకాలమునుండియు వీరివంశీయులు వైద్యశాస్త్రపారంగతులై పండితులై బహువిధౌషధయోగకల్పనాచాతుర్యము గలిగినవా రగుటచే వారివిచిత్రరహస్యప్రయోగము లీవంశస్థులకు వంశపరంపరాగతములై కీర్తికారణము లగుచున్నవి. వీరు చిరకాలమునుండియు రాజావలంబనము కలవా రగుటచేఁ గేవలద్రవ్యార్జనముకొఱకుఁగాక కీర్తికొఱకును, బరోపకారముకొఱకును, వైద్యము చేయుచుండుటయే యీవంశస్థుల వైద్యప్రాశస్త్యమునకు మూలకారణ మని నానమ్మకము. మఱియు నీవైద్యపరంపరలోని వా రందఱును దైవభక్తిపరాయణులును, దయాస్వభావముగలవారును, బాపభీతులును, దురాశాదూరులును నగుటచేఁగూడ వీరివైద్యమునకు మిక్కిలి ప్రాశస్త్యము కలిగి యుండవచ్చు నని చెప్పకతప్పదు.



శిష్టు కృష్ణమూర్తికవిగారిచే స్తుతింపఁబడిన రామయ్యగారితాత రామలింగన్నగారు మహావైద్యుఁడై ధాతుపరీక్షయందు మిక్కిలి పేరుగాంచినందులకొకయుదాహరణముచెప్పఁబడుచున్నది. ఒకప్పుడు రామలింగన్నగారు తమతండ్రిగారి యాబ్దికమున కిరువురు బ్రాహ్మణులను దొలిదినముననే నిమంత్రించి యామఱునాఁడు బ్రాహ్మణుల నాహ్వానించి పాదప్రక్షాళనముఁ జేయుచుండ నందొక్కబ్రాహ్మణుని పాదమూలమున నున్న ధాతువు చేతికిఁ దగిలి యాతఁడు కొన్నినిమిషములలో మృతి నొందు నని గ్రహించి వెంటనే లోపలికిఁ బోయి తిరిగి వచ్చి "నాయనా! నీ కాశౌచము వచ్చినదఁట" నీవు భోక్తకుఁ బనికిరావు. వెంటనే యింటికిఁ బొమ్మని పంపివేసి మఱియొక బ్రాహ్మణుని నిమంత్రించి పితృకర్మ నెఱవేర్చుకొనెనఁట. ఆబ్రాహ్మణుఁ డింటికిఁ బోయినతోడనే మృతినొందెనఁట. ఆయన కంతటి ధాతువిజ్ఞానము గల దని వినియే కాఁబోలు కృష్ణమూర్తికవి యీతనిని "ధాతుపరీక్షాతిదక్షుం"

డని చెప్పియున్నాఁడు.

కృష్ణమూర్తికవికి సమకాలికుఁడైన రామయ్యగారు రాజా జగన్నాథరాజుగారి యాస్థానవైద్యుఁడైనట్లు పైని స్పష్టపఱిచియున్నాముగదా? ఈతనివైద్యప్రభావము తెలిపెడు నొక చిన్నకథ యీక్రింద నుదాహరింపఁబడుచున్నది. రాజా జగన్నాథరాజుగా రొకప్పుడు "ఉరట్ల" యనుగ్రామమున బంధుగృహంబున కేఁగఁగా నచ్చట నాయనకుఁ గొంచెము బడలిక గలిగి యొకవైద్యునిచే వేఁడిచేయు మాత్ర పుచ్చుకొనిరఁట. ప్రకృతిసుకుమారుఁడైన యాశ్రీమంతున కామాత్రి మిక్కుటమైన వేఁడి చేయుటచే నాయన ముక్కువెంబడి నెత్తురు వెడల నారంభించెనఁట. దాని కక్కడ నెవ్వ రెన్నిసాధనములు చేసినను కుదురకయుండుటచే నీరామయ్యగారిని బల్లకిమీఁద తెప్పించి యాసమాచారము నంతయుఁ జెప్పఁగా వా రప్పుడు పచ్చకప్పురముతో నొకయౌషధము మిళితముఁజేసి దానిని దీపముగా వెలిగించి యాపొగను గులాబిపూవుమీఁదఁ బట్టించి దాని నాఘ్రాణింపఁజేయఁగా, వెంటనే యానాసారక్తము తగ్గినదఁట. అప్పు డక్కడివా రందఱును రామయ్యగారి వైద్యనైపుణ్యమునకును రాజుగారి సౌకుమార్యమునకును నచ్చెరువొందిరఁట.

మఱియు నీతనివైద్యప్రభావ మెఱిఁగియున్న తండ్రిగారివలన వినియున్నకుమారు లిప్పటికిని గలరు. కేశనకుర్రున



కు సమీపమున నున్న కొత్తపల్లివాస్తవ్యు లగు ఉప్పలూరి రామజోగన్నసిద్ధాంతిగా రేఁడెనిమిదిసంవత్సరములవయస్సులో నున్నప్పుడు కోటిఫలికి సమీపమున నున్న కోట యనుగ్రామములో నుండఁగా నొకప్పు డాయనకుఁ గొలఁదికొలఁదిగా జ్వరమువచ్చుచు తగ్గుచు నుండెనఁట. అప్పు డాయనతల్లిగారు వైద్యమునిమిత్త మాపిల్లవానిని రామయ్యగారియొద్దకుఁ దీసికొనివచ్చి యీసమాచారమును జెప్పి యీపిల్లవానిచేయి చూచి మీ రెన్నిలంఘనములు కట్టవలయునో చెప్పినయెడల నాప్రకారము చేసెదను. చాలదినములనుండి వలఁతగ నున్న దని చెప్పఁగా వారు చేయిచూచి యీపిల్లవానికిఁ బదునెనిమిదిలంఘనములు కట్టి పందొమ్మిదవదినమునఁ బథ్యము పెట్టినచో నారోగ్యము కలుగు నని చెప్పిరఁట. అప్పు డామె తనకుమారుని కోటగ్రామమునకుఁ దీసికొనివెళ్లి తత్పూర్వము తానూర లేనపుడు ప్రాఁచిఁబడియున్న యిల్లు వాకిళ్లు పరిశుభ్రముచేసికొనుటకై యాపిల్లవానిని దనయింటిముందర నున్న రథముపైఁ గూర్చుండఁబెట్టి తనపని నెఱవేర్చుకొని మఱికొంతసేపటికివచ్చి చూడఁగా నాపిల్లవాఁడు తీవ్రమైన జ్వరముచే నొడలెఱుంగక పండుకొని యుండెనఁట. అంతట నింటికిఁ దీసికొనిపోయి రామయ్యగారిమాటలు దలఁచుకొని యాపిల్లవానిని బదునేడు దినములవఱకు లంఘనములు చేయించెనఁట. ఈలోపునఁ బలవరింతలతో నెంతజ్వరము బాధించుచున్నను రామయ్య

గారు చెప్పినచొప్పున నేయౌషధము నీయకయే ధైర్యముతో నుండిరఁట. పదునేడవనాఁడు తెలివివచ్చి యాబాలకుఁ డాఁకలి వైచుచున్న దని యడిగెనఁట. కాని, తల్లి వైద్యవచనానుసారముగాఁ బందొమ్మిదవనాఁటివఱకుఁ బథ్య మిచ్చుట కంగీకరింపలేదు. తరువాత నక్కడివైద్యులు పిల్లవానిపట్టు చూచి పదునేడవనాఁడే పెసరగుగ్గిళ్లు పెట్టించి పందొమ్మిదవదినమున నన్నము పెట్టించిరఁట. ఆకారణమున వెంటనే యతనికిఁ గీళ్లు పడిపోయెనఁట. ఈవృత్తాంతమును దిరిగి వచ్చి రామయ్యగారికిఁ దెలుపఁగా నాయన దానికిఁ దగిన చికిత్సఁ జేసి స్వల్పకాలములోనే యారోగ్యమును గలిగించిరఁట. ఈవృత్తాంతమును మాతండ్రిగారు తఱచు చెప్పుచుండెడువా రని యువ్వలూరి రామచంద్రశాస్త్రిగారు నాతోఁ జెప్పిరి.

పైని చెప్పఁబడిన రామయ్యగారికుమాళ్ళలోఁ గామన్నగారు తమతండ్రిగారివలెనే మిక్కిలి వైద్యప్రావీణ్యముగలవారై “అఖిలరాజన్యసమాహూయమాన విఖ్యాతయశోధనుల్ నీతనయులు” అని కృష్ణమూర్తికవిగారు చెప్పినట్లు పెక్కు రాజాస్థానముల కరిగి తమవైద్యవిద్యాప్రభావమున విశేషకీర్తి సంపాదింపఁగలిగిరి. ఒకప్పుడు రాజా దంతులూరి జగన్నాథరాజుగారికిఁ గాళ్ళజబ్బుగలిగి నడువలేనిస్థితిలోనికి రాఁగా దమసంస్థానవైద్యుఁడైనకామన్నగారినిబిలిపించి,యెన్నిదినములకీజబ్బు కుదిర్చి మేడ యెక్కింపఁగలరని యడిగిరఁట. అందులకు వారు



“అయ్యా! తమ రాఱుదినములు మాంసాహారము మానినచో నేడవదినమున మేడయెక్కింపఁగలనని చెప్పఁగా, రాజుగారందులకు సమ్మతించి యౌషధము సేవించుచు మూఁడుదినములుమాత్రము మాంసమును వర్జించిరఁట. నాల్గవనాఁడు తమ కనుదినమును నలవాటై యున్న మాంసాహారమును విడువలేక యాయుదయమున వారిసేరీలోనుండి మూఁడుపుట్లధాన్యము కామయ్యగారి యింటియొద్దఁ బురిగట్టిర మ్మని తమ సేవకుల కాజ్ఞాపించిరఁట. అంత సేవకులు వారిసెలవుప్రకారము పురికట్టి కామయ్యగారియొద్దనుండి రసీదు తెచ్చి రాజావారి కిచ్చిరఁట. అంతట యథాపూర్వముగాఁ గామయ్యగారు రాజాగారిని జూచుటకు రాఁగా నంతవఱకు భోజనము చేయకయుండి వారితో నీనాఁడు మేము మాంసముపుచ్చుకొనక యుండఁజాలము; మీతోఁ జెప్పినరీతిగా మూఁడుదినములు మాత్రమే పథ్యము చేయఁగలిగితిమి. తక్కినమూఁడుదినములకును మూఁడుపుట్లధాన్యము మీకుఁ బంపించితిమి. కావున నపథ్యదోషము లేకుండఁ గాపాడుకొనుచు నేడవదివసమున మేడ యెక్కునట్లు చేయవలయు నని కోరిరఁట. కామయ్యగారు రాజాగారి సరసతకు సంతసించి యనారోగ్యము తనయాధీనములో నున్నట్లుగానే తాము చెప్పినచొప్పున మందిచ్చి తక్కిన మూఁడుదినములలోను సంపూర్ణారోగ్యము కలిగించిరఁట.

ఈయనతరమునుండియో ఈయన తండ్రితరమునుండియో కాని యాకొండివారికి "రాజవైద్య" లనియుఁ బథ్యములేకుండ రోగియిష్టానుసారము భుజించుచుండఁగనే యౌషధప్రభావమువలన నారోగ్యము కలిగించెద రనియుఁ బ్రతీతి వచ్చియున్న ట్లూహింపవలసియున్నది.

ఇట్టి ప్రతిభాసంపన్నులైన కామయ్యగారికుమాళ్లలోఁ బెద్దవా రగు రామయ్యగారు మరలఁ దాతతండ్రుల ప్రతిష్ఠను నిలుపఁగల ప్రతిభావంతులై వైద్యవిద్యాప్రభావముచేతనే కాక లౌకికవిద్యాప్రావీణ్యముచేతఁగూడ మిక్కిలివన్నెకెక్కిరి. ఈయన బాల్యమునందుఁ దమతండ్రిగారు జీవించియున్నకాలమున ననుదినమును దంతులూరివారి సంస్థానములోనికి వచ్చుచుండుటయుఁ జంద్రోదయము మొదలగు నౌషధములెవ్వియో వారి కిచ్చుచుండుటయు వాడుక కలదు. ఒకదినమున సీరామయ్యగారు తండ్రిగారియాజ్ఞానుసారముగా వెళ్లి తేనెతోఁ జంద్రోదయమును దములపాకులోఁ గలిపి తీసికొనివెళ్లఁగాఁ గొంతసేపటివఱకు రాజసముచే రాజుగారు బాలుఁడైన యీ రామయ్యగారిని బలుకరింపక యెట్టకేలకు "అబ్బా! ఏలాగు నయ్యా! మందు పుచ్చుకొనుట" యని విసుగుకొనిరఁట. యౌవనారంభదశయందుండి కొంచెము చుఱుకుపాలు గలవా రగుటచే సీరామయ్యగారు, ఇదిగో! ఈలాగున! యని యా మందు తాము నాకివైచి యక్కడ నిలువక యింటికిఁ జక్క



వచ్చిరఁట. అప్పుడు సరసుఁడైన రాజుగా రాచిన్నవానిధైర్యసాహసములకు మిక్కిలి సంతసించి పౌరుషసూచకముగా నుండునట్లు బైజారువంటియాకృతియు, నౌషధము లుంచుకొనుటకుఁ దగినయఱలుగలదియు నగునొక వెండిగొట్టమును జేయించి యౌషధము నాకివైచినదిమొదలు మరలఁ దమయొద్దకు రాక యున్న రామయ్యగారిని బ్రీతిపూర్వకముగాఁ బిలిపించి భయముఁదీర్చి బహుమానించిరఁట.

ఇట్లు బాల్యమునుండియు మిక్కిలి చుఱుకుఁదనము గలిగి మహాలౌకికుఁడైన రామయ్యగారు తమవైద్యప్రభావముచే మిక్కిలి జనవశ్యము కలవారై లోకవ్యవహారములయందు మిగుల సమర్థులైయుండుటచేఁ గేశసకుర్తిమురాకు శాణేజాతీ కూడ సంపాదింపఁగలిగిరి.

ఈయనకాలములోనే యాకొండివారివైద్యము విశేషవ్యాప్తిలోనికి వచ్చిన దని చెప్పవచ్చును. ఈయన లోకజ్ఞానసంపన్నుఁడు గనుక నాకాలమునాఁటి పెద్దయుద్యోగులతో మైత్రి సంపాదించి వారిద్వారమున నితరమండలములకుఁగూడ వైద్యప్రమేయమునఁ బల్లకి నెక్కి యంచెబోయిలతోఁ బ్రయాణములు చేయుచువచ్చిరి. ఈయన బందరు బెజవాడ గుంటూరు రాజమండ్రి కాకినాడ మున్నగుపట్టణముల కరిగి గొప్పవారియిండ్లలో వైద్యముచేసి మెప్పుపొందినట్లు వారి "రికార్డు" వలనఁ దెలియుచున్నది. ఆకాలమున "డిప్యూటీక

లక్టరు" ఉద్యోగమునం దున్న మ. శా. రా. పారేపల్లి పుం
డరీకాక్షుఁడుగారి కీరామయ్యగారి వైద్య మున్నను వీరి సుగుణ
సంపత్తి యున్నను వీరి లౌకికజ్ఞానసంపత్తి యున్నను విశేషగౌర
వప్రపత్తు లుండెడివి. బందరులో జిల్లాసిరస్తాదారుగా నున్న
మ. రా. రా. కవిపురపు వేంకటరత్నంగారు మూత్రబద్ధవ్యా
ధిచే బాధపడుచుండఁగాఁ బుండరీకాక్షుఁడుగా రిది రామయ్య
గారివలనఁగాని సాధ్యముకా దని యెంచి వేంకటరత్నంగారితోఁ
జెప్పి రామయ్యగారికి వర్తమానింపఁగా నాయన యంచెబో
యలపై బందరుపురమునకుఁబోవుచు మార్గమధ్యమున నేది
యో యొకగ్రామమునొద్ద సాయంకాల మగుటయు నారాత్రి
యచ్చట నిలుచుట కాగ్రామమున నొకగృహస్థుని యింటి
కరిగిరఁట. అచటికి సమీపమున నొకగృహమునొద్ద నింటిలో
నివారు దుఃఖపడుచుండుటఁ జూచి యందులకుఁ గారణము
నితరులవలన నెఱింగి యచ్చటి కరిగి స్మృతితప్పి యున్న యా
రోగి చేయిచూచి యీరోగికిఁ బ్రాణభయములే దని ముక్కు
దగ్గఱ సున్నమును నవాసారమును గలిపి వాసనచూపించిరఁట.
అంతట నారోగికి స్మృతికలిగి కనులువిచ్చి చూడఁగా నచ్చటి
వా రందఱును మిగుల నచ్చెరు వంది వారి ననేకవిధములఁ గొ
నియాడి యారోగికి మరల నట్టివ్యాధి రాకుండుటకుఁ దగిన
యౌషధ మిప్పింపుఁ డని ప్రార్థించిరఁట. రామయ్యగారు వారి
కోరికప్రకార మౌషధ మిచ్చి వారివలన సన్మానమునుబొంది



యటుపిమ్మట గమ్యస్థాన మగు బందరున కరిగిరఁట. అచ్చట
వేంకటరత్నముగారి మూత్రబద్ధస్వభావము నిదానించి దాని
కుచితమైన గోమూత్రశిలాజతు నొక్కమోతాదుమాత్రమే
మున్నవునీళ్లతో నీయఁగా నింతకుఁ బూర్వము మూత్రనాళ
మున కడ్డుగా నిలిచియున్న యిందుగగింజంత శిల యొకటి
యూడిపడినదఁట. నాఁడుమొదలు ఆవేంకటరత్నముగారికి మరల
నాజన్మములో నొక్కప్పుడును మూత్రబద్ధ బాధలేకుండపో
యినదఁట. అప్పుడావేంకటరత్నముగారు తమకు రామయ్య
గారు చేసిన మహోపకారమునకు విశేషసన్మానముచేసిరఁట.
రామయ్యగారు వైద్యమునిమిత్త మెచ్చటికి వెళ్లినను నాగ్రా
మమందలి రోగు లందఱును వచ్చి గుమిగూడి తమతమ రోగ
బాధల నెఱిఁగించి యుచితమైన యౌషధములను సేవించి రో
గనివారణము చేసికొనుచుండెడివారు. ఆవిషయమును విశదీక
రించుట కాకాలమున నెవ్వరో యొకకవి చెప్పిన యొకపద్య
భాగము నీక్రిందఁ బొందుపఱచుచున్నాను.

సీ. ఆసమ్మయెవ్వరే?—యక్కరో! యెఱుఁగవా!
యాకొండి రామయ్య యంచుఁగలఁడు
ఇతఁ డఁటో రామయ్య? యీవచ్చుచున్నట్టి
వా రంద ఱెవ్వరో వారిజాక్షి!
వీరు గాదే రోగపీడితులై వచ్చి
స్వస్థతఁ గని యేగుసరసవరులు ........

ఈపద్య మంత ప్రౌఢముగా లేకపోయినను నా కిది పూర్తిగా రాకపోయినను ఉన్న భాగము రామయ్యగారియొద్దకు రోగిసమూహము తండోపతండములుగా వచ్చి యారోగ్యము నందిపోవుచుండుటయు, నాసంగతి యూసమ్మ కూనమ్మలుకూడ చెప్పుకొనుచుండుటయుఁ గలదన్న సంగతి స్పష్టపఱచుటకుమాత్రము చాలియున్నది. డిప్యూటీకలక్టరుగారైన పారేపల్లి పుండరీకాక్షుఁడుగారికిని దదితరులైన మఱికొందఱుద్యోగస్థులు మొదలగువారికిని వీరితో వైద్యసంబంధమును దెలియఁబఱచు కొన్నియుత్తరములనుమాత్ర మీదిగువఁ బ్రకటించి గ్రంథ విస్తరభీతిచే వీరిచరిత్ర మింతటితో విరమించుచున్నాను.

మహారాజశ్రీ ఆకొండి                కాకినాడ
రామయ్యగారికి—                24-3-78

Dear Sir,

శ్రీ బాదం వెంకటచలంగారికి కాయిలాగా వున్నది. కాయిలావివరం వారివుత్తరంవల్ల విశదపడుతుంది. అయ్యా మంచిఔదార్యము యోగ్యతకలవారు. మీరు రావడమందు మా అందరికీ చాలా కోరిక ............

చిత్తగించవలెను.

సే॥ పారుపల్లి పుండరీకాక్షుడు,

(డిప్యూటీకలక్టరు)



ధవళేశ్వరం

27-8-87

మహారాజశ్రీ ఆకొండిరామయ్యగారిసన్నిధికి—

సే॥ తాడిమేటి కైలాసరాయుడు అనేకనమస్కారములు చేసి వ్రాయంగల విన్నపములు—

......మీరు పంపించిన అవుషధములు బహు ఆపద సమయములో అందడముచేత దయుకు చాలా ఆనందమును పొందినాను. నాకు వుండుకున్న అజీర్ణశూలబాధ సదరు అవుషధము పుచ్చుకొన్నది మొదలుకొని క్రమక్రమముగా తగ్గుతూ వున్నది......నిండా దయవుంచవలెను.

చిత్తగించవలెను.

సే॥ కైలాసరాయుడు.

(డి. పి. డబ్లి. హెడ్డురైటరు)

మహారాజశ్రీ ఆకొండి రామయ్యగారి సముఖమునకు—

వి॥ శే॥ గురజాడ సుందరమ్మ నమస్కారములు.

త॥ ......అక్కయ్యగారివంట్లో క్రమముగా నింపాదిగా నుంటూన్నది. నాన్నగారిమాటకు యిక అడ్డుచెప్పడానికి వీలులేదు గనుక వెళ్లేలాగే కనుపడుతుంది—గనుక నెలరోజులకు తగ్గ అవుషధం మాత్రల్లు పంపించకోరుతాను.

చిత్తగించవలెను.

శ్రీరాములు.

శ్రీమద్యజనాది షట్కర్మనిరతులయిన్న శ్రీవేదమూర్తులైన ఆకొండి రామయ్యగారిసన్నిధికి—

వి॥ శే॥ క్రోవి దక్షిణామూర్తిశాస్త్రి అనేకనమస్కారములు చేసి చాయంగల విన్నపములు—ఇక్కడ ముమ్మిడివరములో కుశలము, త॥ మీరు యిచ్చిన అవుషధము అంతా అయిపోయినది. ఇప్పుడు నాకు చాలా గుణముగా వున్నది. నిశ్శేషముగా నాకు వున్న దుర్గుణం నిర్మూలించుటకు యింకా యిరవైరోజులు అవుషధము పుచ్చుకోవలె నని యున్నది గన్క ఈమనిషిద్వారా యిరవైదినములకు కావలసిన అవుషధం పంపించకోరుతాను..........................

చిత్తగించవలెను.

సే॥ క్రోవి దక్షిణామూర్తి వ్రాలు.

పైని జెప్పఁబడిన రామయ్యగారికి నారప్పగారు సీతారామయ్యగారు నను నిద్దఱు సోదరులు కలరు. వారిరువురును తమయన్నగారియెడల విశేషభక్తిగౌరవములు కలవారై యుండెడివారు. వారిలో సీతారామయ్యగారు సంతానము లేక కాలధర్మము నొందిరి. తమ్మునియందుఁ గల సోదరవాత్సల్యము మిక్కుటమైనది గనుక రామయ్యగారు తమకుమారులలో నొకని కాయనపేరు పెట్టిరి. అప్పటికి సంతానహీనులై యున్న మఱియొకతమ్ముఁడు నారప్పగారి కాయనను దత్తునిఁ జేసిరి.



అతరువాతఁ గొంతకాలమునకు నారప్పగారి కౌరసప్రాప్తికూడఁ గలిగినది. రామయ్యగారికిని నారప్పగారికిని గలసౌభ్రాత్రము మిక్కిలి వర్ణనీయమైనది. ఏబ్బదిసంవత్సరములవఱకు సమష్టిగా నుండుటయే దీనికిఁ దార్కాణము. ఎట్టివారి కైనను దాయభాగములలో మైత్రి చెడుట సంభవించు నని తలఁచి లోకజ్ఞుఁడైన రామయ్యగారు తమసౌభ్రాత్రమున కెప్పటికిని భంగము కలుగకుండవలయు నని తొలుదొలుతనే తమతమ్మునితో యుక్తమార్గమున నొకకొన్ని యాంతరంగికలేఖలను నడపి యన్యోన్యహృదయములయందుఁ గళంకములు లేకుండఁగను ముందు పుట్టకుండఁగను జేసికొనిరి. ఆలేఖలలోఁ గొన్నిటి నీక్రిందఁ జూడఁదగును.

—♦ ఆంతరంగికలేఖలు ♦—

చిరంజీవీ—

నాయనగారు కాలంచేసే సమయమందు మనయిద్దరినీ దగ్గర వుంచుకొని చెప్పినమాటలప్రకారం వారిఅనంతరమందు నీవాటా నీవు పంచుకొని జాగ్రత్త పెట్టుకొమ్మని చెప్పగా నీవు మనవుభయులను కలసి వుందా మని యెవరి స్వార్జితములు వారు పుచ్చుకొందా మని వకరిస్వార్జితం వకరికి నిమిత్తం లేదని ప్రస్తుతం ఈకుటుంబభారమును నేను నిర్వహించుకో లేనని చెప్పినందున ఆప్రకారం యింతవరకు నీ కేవిధమైన జోక్యమూ లేకుండా నేనే యీకుటుంబఖర్చులు కార్యకారాదులు జరిగిం

చూతూ వచ్చినాను. యిప్పుడు నీకు కుమారుడు కలిగినాడు. యికముందు కార్యకరామలకు ఖర్చు కావలసియున్నది. నాకోడ్లతా॥ వస్తువులు తాకట్టుపెట్టి కొంతభూమి కొన్నాను. కాబట్టి మనకు ముందు ముందు మనస్పర్ధలు కలుగగలవు గనుక యెవరివాటా వారు విడతీసుకొని జాగ్రత్తపెట్టుకుంటే బాగుంటుంది.

అన్నయ్యగారికి.

మీరు వ్రాయించిన చీటి చూచుకొన్నాను. మీరూ నేనూ భగవంతునిసాక్షిగా మాట్లాడుకొన్నమాటలకు యెప్పటికి తిరుగువాడను కాను యిదివరలో యెట్లా చూస్తున్నారో ఆప్రకారం ముందుకూడా చూస్తూ యీకుటుంబపోషణము చేయిస్తూ వుండగలందులకు కోరుచున్నాను......

ఇట్లు తనప్రతిభావిశేషముచేతఁ గులవిద్యయైన వైద్యమును విస్తరించి తనలౌకికజ్ఞానముచేఁ గుటుంబవసతిని విరివిచేసి మిక్కిలి ప్రఖ్యాతివహించిన రామయ్యగారికి ముగ్గురు కుమాళ్లు గలిగిరి. వారిలోఁ గడసారికొడుకును దమ్మునకు దత్తతయిచ్చిన ట్లింతకుఁబూర్వమే వ్రాసియుంటిని. పెద్దకుమారుఁడైన కామయ్యగారు మూఁడుమూర్తులఁ దండ్రిపోలిక వహించి తండ్రియనంతరమునఁ దమకులవిద్య యగు వైద్యమునకు వన్నె దెచ్చుట కారంభించిరి. ఈయనకూడఁ దండ్రిగారివలెనే చుఱుకుఁదనమును నాత్మగౌరవమును గలిగి యెప్పుడు నెవ్వరికిని నొడుఁ



గక నిర్భయముగా మొగమోటము లేకుండ సంచరించుచు స్వేచ్ఛగాఁ దమవైద్యజీవనమును నడిపించుకొన్న యుత్తముఁడు. తండ్రిగారు జీవించియున్నప్పుడే వైద్యవిద్యయందుఁ బాటవము సంపాదించి తండ్రికిఁ బ్రతినిధియై వైద్యము చేయుచుండెడివారు. పల్లెటూళ్లలో సాధారణముగా వైద్యము చేయువారి కొకవేళ యనికాని యొకనియమ మనికాని యుండకపోవుటచే రోగులు తమ కెప్పు డవసరమైన నప్పుడే వచ్చి తమ బాధలను వెల్లడించి యౌషధముల నడుగుచుండుట యాచారమై యుండును. ఒక్కొక్కప్పుడు వైద్యుఁడు నిద్రపోవుచుండఁగా నర్ధరాత్రమున వచ్చి తలుపుగొట్టి లేపుటయు, మఱియొకప్పుడు వైద్యుఁడు భోజనముచేయుచున్న సమయమున వచ్చి వీథిలో బొబ్బలుపెట్టుటయుఁ దఱచు తటస్థించుచుండును.

ఆకొండివారి కున్న యుత్తమగుణములలో నొకటియగునది పరమశాంతి. ఆర్తులెట్టికాలమున వచ్చి మం దడిగినను నిచ్చుచుండుట వారినియమములలో నొకటి. ఇది యిట్లుండఁగా, నొకప్పుడు కామయ్యగారును, ఆయనతండ్రిగారును స్నానముచేసి (భోజనమునకు) మడిగట్టుకొని గంధాక్షతలు ధరించుసమయమున వీథిలో నెవ్వరో మందునకు వచ్చి కేకవేయఁగా బాల్యముచేఁ గామయ్యగారు కొంచెము మనస్సులో విసుగుకొనుచున్నను దండ్రిగారిభయమువలన నావెంటనే వీథిలోనికిఁ బోయి, వచ్చినవా రెవ్వరో యెందులకు వచ్చిరో

యని తెలిసికొనకతీఱదిగాదు. అట్లు తెలిసికొని యావచ్చిన రోగి శూలనొప్పిచే బాధపడుచున్నట్లు విని వచ్చి తండ్రిగారితోఁ జెప్పఁగా వారు తమపెట్టెలో నున్న యౌషధమును దేనినో (దానిపేరు నాకిప్పుడు జ్ఞాపకముగ లేదు.) తీసియిచ్చి యారోగిని బంపివైచిరమ్మని చెప్పిరఁట. మడిగట్టుకొనియున్న రామయ్యగారు మనస్సులో విసుగుకొనుచు మడివిడిచి పెట్టె తీసి మందిచ్చుటకు బద్ధకించి తాను బొట్టుపెట్టుకొనుచున్న "యక్షతలు" గట్టిపడునట్లు చేసి తమతండ్రిగారికిఁ దెలియకుండ మాత్రకట్టి యారోగి కిచ్చి పంపివైచిరఁట. తరువాత వీరు భోజనముచేసి స్థిమితపడి చావడిలోఁ గూర్చుండియుండఁగా నారోగి మరల వచ్చి తనశూలనొప్పి తగ్గిపోయి చాల సులువు గలిగిన దని చెప్పెనఁట! అప్పుడు రామయ్యగారు తమమందులలో దేనివలన శూలనొప్పి కంతశీఘ్రకాలములో గుణముకలిగినదో తెలిసికొనవలయు నని సమీపమున నున్న కుమారునిఁ జూచి, నాయనా! ఏమిమం దిచ్చితివి? నేనుజెప్పినదియా, మఱియొకటియా? అని ప్రశ్నించిరఁట. తనమందువలన రోగి కేయపకారమును జరగక యారోగ్యము కలిగిన దని సంతసించియో తండ్రిగారియెద్ద నసత్యమాడుటకు సంశయించియో రామయ్యగారు వెలవెలఁబోవుచు నేను బొట్టుపెట్టుకొనుచున్న యక్షతలే మాత్రకట్టి యిచ్చితి నని నిజము చెప్పివైచిరఁట! వస్తుగుణపారంగతుఁడైన రామయ్యగా రక్ష



తలవలన శూల యెట్లు నివారణమైన దని యోజించి పసుపును, అరటిపువ్వు దొప్పలుమాడ్చిన క్షారమును మిశ్రమై జీర్ణకోశమునందలి మాంద్యమును దొలఁగించి యజీర్ణమూలకమైన శూలకుఁ బనిచేసి యుండవచ్చు నని యూహించుకొని సమాధానపడుచుకొనిరఁట! వస్తుగుణ మెట్లున్న నిది హస్తవిశేషమైనం గావచ్చును. ఇట్లే యీయనబాల్యమునఁ బలుమార్లు స్వతంత్రౌషధములు కాలోచితముగ నిచ్చి రోగశాంతి చేసి యుండుట తటస్థించుచువచ్చెను.

రానురాను పెద్దవారయినతరువాత గొప్పగొప్పయౌషధములను శాస్త్రప్రకారము సిద్ధముచేసి యసాధ్యరోగములను పెక్కింటిని నివారించి తమచికిత్సానైపుణ్యమును వెల్లడించిరి. ఈయనయుఁ దండ్రిగారివలెనే తంజాములోనికాలు కుర్చీమీఁదను గుర్చీమీఁదికాలు తంజాములోను నుంచుచు సంచరించినవారేకాని యర్థాశచే నైనచోటికిని గానిచోటికిని బోయెడువారు కారు. తమయింటి కేవేళ నెవరువచ్చినను లేదనకుండ మరల రమ్మనకుండ మందు లుచితముగాఁ బంచిపెట్టుచుండుటయే సహజకులాచారమై యుండెడిది. రాఁబట్టవలసినచోట మొగమోటపడి పోఁగొట్టుకొనుటయు నీయనకుఁ గిట్టనదిగాదు. పేదసాదల కీయన యుచితముగా వైద్యముచేసి యెక్కువ పలుకుబడి సంపాదించిరి; కావుననే పనివచ్చినప్పుడు పదుగురు తోడ్పడి కార్యభగ్నములయందు సహాయము సేయుచుండెడి

వారు. ఈయన కొన్నికొన్నిగొప్పస్థలములయందు వైద్యము చేసి యారోగ్యముకలిగించి వారివలన వీరిదర్జాకుఁ దగిన పల్లకులు, లాలకులు, గుఱ్ఱములు, సాలువలు మొదలగు నుచితబహుమానము లందినట్లు వారి "రికార్డు" వలనఁ దెలియుచున్నది. గ్రామములోని కప్పుడప్పుడు తహసీలుదారులు సబ్ మేజస్ట్రీట్లు మొదలగు గొప్పయుద్యోగస్థులు వచ్చినప్పుడు వీరిదర్శనమునకు వచ్చుటయే గాని తక్కినవారివలె వీరు, ఆయధికారుల నాశ్రయింపఁబోవుట యెప్పుడును లేదు. భగవంతుఁడిచ్చిన యన్నవస్త్రములకు లోపము లేనప్పు డాత్మగౌరవమును బోఁగొట్టుకొని యన్యుల నేల వ్యర్థముగా నాశ్రయింపవలయు నని దృఢమైన యభిప్రాయ మీయన కుండినట్లీయన వర్తనమువలనఁ దోఁచుచుండెడిది. అంత నిర్లక్ష్యము గలవాఁడగుటచేతనే యెట్టివారితో నైనను సత్యవిషయము వచ్చినపుడు నిర్లక్ష్యముగా మాటలాడుచుఁ దనకులవిద్యవలన స్వేచ్ఛాజీవనము చేయఁగలిగి ధన్యుఁ డయ్యెను. ఈధన్యాత్ముని శౌర్యగాంభీర్యసాహసరోగనిదానాది మహాగుణములను వెల్లడించుకథలు చాలఁ గలవు కాని విశేషగ్రంథవిస్తరము గాకుండఁ గొన్నిటినిమాత్రము వ్రాయుచున్నాను.

ఈయన యొకప్పుడు గూటాలలో "ఇంటుగ కోనేశ్వరశాస్త్రి" గారి యింటియొద్ద వైద్యముసేయుట కాహూతులై యరిగి యచ్చట వైద్యము చేయుచుండఁగా నాయూరిలో



నుద్యోగవశముచే నివసించుచున్న దాక్షిణాత్యగృహస్థునిభార్యకు ననారోగ్యముగా నున్నందున నీయన నక్కడకు సగౌరవముగాఁ గొంపోయి యామెకుఁగూడ ధాతుపరీక్షచేసి యౌషధము నీయవలసినదిగా కోరిరఁట. అందుల కాయన సమ్మతించి తమబసకు సమీపమున నున్న యాదాక్షిణాత్యుని గృహమున కరిగి రోగిని దీసికొని రమ్మని చెప్పిరఁట. అప్పుడు రోగపీడితురాలై యున్న యాకుటుంబిని యొక గదిగుమ్మము పొదిగిటఁ గూరుచుండి తనవామహస్తమును వస్త్రాచ్ఛాదితము చేసి ధాతుపరీక్ష చేయుటకుఁ గామయ్యగారిముందునకుఁ జాఁచినదఁట. అది చూచి కామయ్యగారు తమమనస్సులోఁ గొంచెము సంశయించుచుఁ బెక్కుచోట్ల జమిందారీస్థలములలో ఘోషాస్త్రీలుకూడ ననారోగ్యసమయములయందు నిస్సంశయముగాఁ జేయిచూపించుకొనుచుండఁగా నిచట నీయిల్లాలి కింత సందేహ మేల చెప్పుమా యని తలంచుకొని దాని కనుగుణముగాఁ దనచేతిలోనున్న పేఁపబెత్తము నామె హస్తాంగుష్ఠమూలమున నిలిపి చూచుచుండెనఁట. అప్పు డాయుద్యోగి "అయ్యా! అట్లు చూచెద రేమి? మీరు చేతితో ధాతుస్థానమును బరీక్షింపవలయునుగదా?" యనియడిగిరఁట. అప్పుడు కామయ్యగారు "అట్లవసరము లేదు, నేను నా బెత్తముద్వారా ధాతుచలనమును గనిపెట్టఁగల నని చెప్పి, చూచి బసకు వచ్చిరఁట. ఇంటివా రెట్లున్న దని యడుగఁగా

నచ్చుట జరిగినసమాచార మంతయును జెప్పి వారిని గడు పుబ్బునట్లు నవ్వించిరఁట. మిక్కిలి సున్నితముగాఁ బరీక్షింప వలసిన ధాతుస్థానమును బట్టఁగప్పి పరీక్షించినయెడల రోగము సులువుగా కనిపెట్టుటకు వీలుండదు. ఈసంగతి వైద్యము చేయించుకొనువారికిఁ దెలియనప్పుడు మనము చేయవలసిన దేమున్నది? యని తమయభిప్రాయమునుగూడ వెల్లడించిరఁట. అప్పుడీసంగతి శాస్త్రిగారు రహస్యముగా నాయుద్యోగికిఁ దెలియఁజేయుటయు నాయన పశ్చాత్తాపపడి అయ్యో! ఇది మాదేశాచారము కాని మఱియొకటి కాదని చెప్పుచు మరల వచ్చి కామయ్యగారిని బ్రార్థించి తీసికొనిపోయి యాయన యిష్టానుసారముగా వైద్యముచేయించుకొని యచిరకాలములోనే యారోగ్యభాగ్యమును బొందిరఁట.

కామయ్యగారి ధాతుపరీక్షాదక్షత్వమును వెల్లడించు మఱియొకవృత్తాంతము నిందు వ్రాయుచున్నాను. కామయ్యగారికిఁ బ్రియసోదరునికుమారుఁడైనట్టియు, నాయన కత్యంత ప్రేమపాత్రమైనట్టియుఁ బ్రస్తుత మాకొండివారివైద్యమున కాలంబనభూతులై పూర్వప్రతిష్ఠను నిలుపుచు భిషగ్వృత్తికిఁ గీర్తి తెచ్చుచున్న రామమూర్తిగారికి బాల్యమున గానవిద్యాభ్యాసము చేయించుటకుఁ గ్రొత్తలంకనుండి కొండపల్లి యజ్ఞన్నగారను గాయకుని రప్పించి కామయ్యగారి తండ్రిగారగు రామయ్యగారు (అనఁగా రామమూర్తిగారి పితామహులు) ఆగాయకునకున్న దగ్గువ్యాధి కౌషధ మిచ్చుచు నాయన



చే మనుమనికి గంధర్వకళ నేర్పించఁ బ్రారంభించిరఁట. అంతట నొకనాఁ డాగాయకుఁడు కామయ్యగారిచేత చేయి చూపించుకోఁగా నాయననాడిని బరీక్షించి యత్యంతాసన్నమై యున్న యాయనమృతిని గనిపెట్టి యీనాఁడు మానాయనగారిని చేయిచూచి మందీయఁగోరుఁ డని చెప్పిరఁట. గాయకుఁ డాసమాచారమును రామయ్యగారితోఁ జెప్పి చేయిచూపించుకొనఁగా రామయ్యగా రప్పటిస్థితిని గ్రహించి తమకుమారుని ధాతుపరీక్షాసామర్థ్యమునకు సంతసించి యీసమాచారము నాగాయకునకుఁ జెప్పక మీకారోగ్యము కలుగువఱకు మీరు మీగ్రామముననుండి యౌషధసేవచేయుఁ డని చెప్పుచుఁ బల్లకిబోయీలను కుదిర్చి పయనము సాగించి పంపివైచిరఁట. తరువాత నాగాయకుఁడు కొలఁదిదినములలోనే దేవగాయకులలోఁ గలసిపోవుటచేఁ దిరిగి కేశనకుఱ్ఱు వచ్చుట తటస్థింపలేదఁట. కామయ్యగారి చికిత్సాదక్షత నెఱింగించుట కిప్పుడున్న చెఱుకూరి వేంకటసుబ్బారాయఁడుగారు మఱియొకవృత్తాంతమును జెప్పుచున్నారు.

అ దెట్లనఁగా, పై వేంకటసుబ్బారాయఁడుగారు తమ బాల్యమున ముంగండ యనుసగ్రహారమున గ్రామపాఠశాలలోఁ జదువుకొనుచుండఁగాఁ బరీక్షాదినమునకుఁ బూర్వదినమునఁ దీవ్రమైన జ్వరముచేఁ బీడితులై యుండి యాసమయమున వైద్యవశమున నచ్చటికి విచ్చేసియున్న కామయ్యగారి

మొద్దకుఁ బోయి తమపరీక్షావృత్తాంతమును దమయనారోగ్యస్థితిని యాయనతోఁ జెప్పుకొనఁగా నాయన జాలిపడి "నేనిచట నుండుటకు వీలులేదు. ఈనాఁడే మాగ్రామమునకు వెళ్ళవలసిన యవసరము తటస్థించినది. అట్లైనను నే నౌషధమిచ్చెదను; దీని నీనాఁడే సేవించినయెడల రేపు నీపరీక్షాకాలమునకు జ్వరముతగ్గి నీపరీక్ష కభ్యంతరము లేని యారోగ్యమును బొందఁగలవు. కాని పరీక్షయైన తిరువాత నామఱునాఁటి నుండి యెనిమిదిదినములవఱకుఁ గఠినలంఘనములు చేసినఁగాని నీకు సంపూర్ణారోగ్యము గలుగ" దనిచెప్పి వెడలిపోయిరఁట. వేంకటసుబ్బారాయఁడుగారు వారు చెప్పినమాటలలో నొక యక్షరమైనను దప్పకుండ జరిగిన దని యీనడుమనే నాతోఁ జెప్పినారు. ఈకామయ్యగారుకూడఁ దమతాతముత్తాతలవలెనే గొప్పగొప్ప స్థలములయందు వైద్యముచేయుట కాహ్వానింపఁబడుచు వచ్చినట్లు తెలియఁజేయు లేఖలు కొన్ని యీదిగువఁ బ్రకటించుచున్నాను.

శ్రీ వేదమూర్తులైన ఆకొండి కామన్నగారికి. రాజా సాగి సూర్యనారాయణరాజు నమస్కారము.

ఇక్కడ పోలవరంలో క్షేమం. అచ్చట మీ క్షేమములు తర్చు వ్రాస్తూవుండవలెను. చంద్రోదయమున్నూ సింధూరభూషణమున్నూ తరుణార్కమున్నూ ఈమొదలయిన కొన్ని అవుషధములు యిప్పించవలశినదని మిమ్ములను అడుగుమని సరిపల్లెనుంచి శ్రీ మహాలక్ష్మీసమానులైన శ్రీరాజా అమ్మయ్యగారున్నూ శ్రీరాజా బావాజీగారున్నూ వ్రాయించినారుగన్కు అచ్చట మాకు శ్రేష్టమైన అవుషధములు జతపడ్డవిగన్కు మాయందు నిండా అభిమానముంచి సదరు అవుషధములు ముఖ్యంగా ఇప్పిస్తారని నమ్ముతాను...... అచ్చట తాజావైద్యులదగ్గిర ఎన్ని అవుషధములు పుచ్చుకొన్నప్పట్కి ఆరోగ్యంగా వుండలేముగన్కు ఇంతదూరం వ్రాయడమైనది.

చిత్తగించవలెను.

శ్రీరాజా సాగి సూర్యనారాయణరాజుగారివ్రాలు.



కాకినాడ.

24 మార్చి 1878.

శ్రీ వేదమూర్తులైన బ్రహ్మశ్రీ ఆకొండి కామయ్యగారికి— బాదం వెంకటాచలం దండములుపెట్టి చేయంగల విన్నపములు.

మహారాజశ్రీ పారేపల్లి పుండరీకాక్షుడుగారు తమపేరట యిచ్చిన ఉత్తరం ఇందుతో పంపించినాను. తమవల్ల నాకు వుండుకొన్న ఖాయిలా స్వస్థత అవుతుందని మనస్సా నమ్మి తమరు యిక్కడకు దయచేయగలందులకు కోరడమైనది.

చిత్తగించవలెను.

స॥ బాదం గవర్రాజు.

మకాం రాజమండ్రి
27-11-88

మహారాజశ్రీ శ్రీవేదమూర్తులైన ఆకొండి కామయ్య గారి సన్నిధికి — శో॥ బంధకవి వెంకన్న అనేకనమస్కారములు చేసి వ్రాయంగలవిన్నపములు.

నాన్నగారు మీరు యిచ్చినమాత్రలవల్ల చాలా మందికి ఆపదలుపోయిన వని చాలా సంతోషించినారు. ఆమాత్రలు మిమ్ములను తిరిగికోరినాను మీజవాబు రాకపోయినందున దయతప్పిపోయినదని మానుకొన్నాను......

చిత్తగించవలెను.
బంధకవి వెంకన్న.

ఈ కామయ్యగారి ప్రియసోదరుఁడగు రామస్వామిగారుకూడ ఘనవైద్యులలో గణింపఁదగినవారు. ఈయనకు విశేషమైన శాస్త్రజన్యజ్ఞానము రోగనిదానము నుండెడిది. ఈయన యన్నగారివలెఁ గాక పరమసాత్త్వికస్వభావముగలిగి యైహికమునకంటె నాముష్మికమునం దెక్కువ యాసక్తితోఁ బ్రవర్తించుచుండువారు కావునఁ బ్రత్యేకము వైద్యప్రశంస యందే కాక పారలౌకిక వ్యాపారమునందుఁగూడఁ గొంతకాలము వినియోగించుచుండెడివారు. ఉదయముననే లేచి స్నానసంధ్యాద్యనుష్ఠానములు తీర్చుకొని దేవతార్చనమును, అధ్యాత్మరామాయణపారాయణమును, భగవత్సంబంధమైన స్తోత్రపాఠములును మున్నగు పవిత్రకర్మలతోఁ గొంతకాలక్షేపము చేసి కాని మఱియొకపని చేయువారు కారు. ఈయన తమ యింటికి వచ్చి కోరెడు వారికే తఱచు వైద్యము చేయుచుండెడివారు. ఇట్లనుటచే వీరు గ్రామాంతరములయందు బొత్తిగా వైద్యము చేయలేదని చెప్పుటకాదు. కాని మొత్తముమీఁద నీయనకు గ్రామాంతరములయందంత యెక్కువగా వైద్యప్రవృత్తి జరుపుట కాసక్తి లేదని చెప్పవచ్చును. వీరు ప్రతిదినమును పవిత్రమైన గార్హస్థ్యధర్మములను నిర్వర్తించుకొనుచు నిరాశాపరులై పరోపకారార్థము శక్తి వంచనలేకుండ నుచితవైద్యమును జేయుటయందే విశేషాసక్తిగలిగి సత్త్వగుణప్రధానముతోఁ గాలక్షేపము చేయుచువచ్చిరి. ఈయనను గార్హస్థ్యమున నున్న యొకపరమర్షి యని చెప్పిన నతిశయోక్తి కానేరదు. "అల్పాచ మాత్రా బహులో గుణశ్చ" అను లక్షణ మీయన వైద్యమునందుఁ గనుపట్టుచుండెడిది. దీనికిఁ బ్రమాణముగా నొక చిన్నవృత్తాంతము నిక్కడఁ జెప్పవలసియున్నది.

ఒకనాఁ డొకపంచముఁడు తనకేదియో యస్వాస్థ్యముగనున్నదని వచ్చి చెప్పుకొనఁగా నీయన యారోగమున కనుగుణమైన యొకచిన్నయౌషధపు మోతాదును సన్ననికాగితమున ధాన్యపు గింజకంటెఁ గొంచము పెద్దపొట్లముగాఁగట్టి "యోరియబ్బీ, ఈపొట్లమును దేనెతోఁ బుచ్చుకొనినయెడల

నీజబ్బుకుదురు" వని యిచ్చిరఁట. వాఁడా పొట్లమును దీసికొనిపోయి తేనె తెచ్చుకొని యాపొట్లమును గొంతుకలో వేసికొని యాతేనె నోటిలోఁ బోసికొని మ్రింగెనఁట, కాని యా పొట్లము వానికి సరిగా జీర్ణముగాక విరేచనద్వారమునఁ బోయెనేమో కాని వాని కేమియు గుణము కనఁబడలేదు. మఱునాఁ డారోగి మరల వచ్చి "బాబూ! తమరిచ్చిన పొట్లము తమ సెలవు ప్రకారము తేనెతో మ్రింగినానుకాని నాకేమియు గుణము కనఁబడలే దని చెప్పినాఁడఁట. అప్పు డాయన యేమి చెప్పుమా? మహావీర్యవంతమైన యాయౌషధము వీని కేల గుణమిచ్చినదిగాదని సంశయించుచు "ఓరీ! నీవా పొట్లము నెట్లు పుచ్చుకొంటి" వని సవిమర్శముగాఁ బ్రశ్నించిరఁట. అప్పుడు వాఁడు "బాబూ! తమరు చెప్పిన ప్రకారమే పొట్లము పొట్లముపాళముగనే తేనెతో మ్రింగినాను" అని చెప్పఁగా నాయన యాశ్చర్యపడి పొట్లము తేనెతోఁ బుచ్చుకొమ్మని చెప్పుటచే నామూర్ఖుఁడు పొట్లములోని యౌషధమునని గ్రహింపలేక పొట్లమునే మ్రింగుటచే నది జీర్ణముగాక వ్యర్థమైనదని గ్రహించి వేఱొక పొట్లము నిచ్చి యిది నీవింటికిఁ దీసికొనిపోయి నెమ్మదిగా, మందు క్రిందపడకుండఁగా విప్పి లోపలనున్న మందును రావియాకులోఁ గొంచెము తేనెవేసి మందు దానిలో మధ్యవ్రేలితో బాగుగాఁ గలియునట్లు కలపి నాకివేయు మని స్పష్టముగాఁ జెప్పిపంపిరఁట. తరువాత వాఁ డట్లుచేసి వెంటనే యారో



గ్యమునొంది వచ్చి "బాబూ! ఈసారి తమరిచ్చిన మందు నారోగమునంతను బోఁగొట్టిన" దని నమస్కరించి పోయెనఁట. ఈవృత్తాంతమువలన రామస్వామిగారు లోకమున శ్లోకపాఠమును జెప్పి తా మొకపాఠమును నేర్చుకొన్నవారైరి. శ్లోకమునకుఁ జెప్పినపాఠమే మనఁగా! రామస్వామిగారి యౌషధము స్వల్పప్రమాణము కలదయ్యును విశేషవీర్యవంతమై యొకటి రెండుమోతాదులతో రోగనివారణచేయఁగల దని. ఆయన నేర్చుకొన్న పాఠమేమనఁగా! మూర్ఖులైన రోగులు వచ్చినప్పుడు వారికి బాగుగాఁ దెలియునట్లు మందు పుచ్చుకొనువిధానమును, అనుపానము, సేవింపవలసిన పద్ధతియు విస్పష్టముగాఁ జెప్పవలయునని ఆనాఁడు మొద లెవరుమందునకు వచ్చినను మందిచ్చునపుడు తొమ్మిది మిరియపుగింజలు (ఇది యుదాహరణమునకు చెప్పుచున్నమాట) చెక్కుముక్కు అగునట్లు చితుకఁగొట్టి గిద్దెడు నీళ్ళలో వేసి పొయిమీఁదనుంచి సగమగునట్లు మరగనిచ్చి యాకషాయమును బలుచనిగుడ్డతో వడియఁగట్టి నేనిచ్చిన యీమందును ముందుగా మ్రింగి తరువాత నాకషాయమును బుచ్చుకోవలెను. అని స్పష్టముగాఁ జెప్పి యారోగి చేయవలసిపథ్యమును జక్కఁగా బోధించి పంపుచుండెడివారు. ఆపద్ధతి, నాఁటినుండియు వారిశిక్షణమున వైద్యవిద్యనేర్చిన యస్మాదృశులకందఱకును సర్వసాధారణమైన యభ్యాసమై మందిచ్చునప్పుడెల్లఁ దెలిసినవారికిని దెలియనివారికినిగూడ నావుం

దు సేవించు విధానము మతలబువలెఁ జెప్పివేయుచుండుట వాడుకయైపోయినది.

ఈయన పోలవరమునఁ బ్రత్యేకముగా నివసించుచు స్వతంత్రజీవనము చేయఁగలవారై యుండియు నన్నగారియెడల విశేష భక్తిగౌరవములు కలవారగుటచేఁ బ్రతిదినమును (ఎండయైనను వానయైనను లెక్కసేయక) ఉదయముననో సాయంకాలముననో యొకమాఱు కేశనకుఱ్ఱువెళ్లి యన్నగారి దర్శనముచేసి కొంతవడి యిష్టగోష్ఠితోఁ బ్రొద్దుపుచ్చి వచ్చుచుండెడివారు. ఎప్పుడైనను రామస్వామిగారు రానిచోఁ దమ్ముని జూచుటకుఁ గామయ్యగారు పోలవరము రావలసినదే! దీనిం బట్టి సోదరులసౌభ్రాత్రము మిక్కిలి ప్రశంసనీయమై యుండెడిది. మఱియు నీకుటుంబములోనివారు సోదరస్నేహమునకు భంగములేకుండఁ జేయునట్టి యుపాయము లాలోచించుటలో మిక్కిలి ప్రౌఢులు. కామయ్యగారికి రామస్వామిగారి రెండవ కుమారుఁడగు రాజగోపాలమును దత్తతచేసి పెద్దవారైన కామయ్యగారును దత్తుఁడును గేశనకుఱ్ఱులోను రామస్వామిగారును బెద్దకుమారులగు రామమూర్తిగారును దానికత్యంతసమీపములోనున్న పోలవరముగ్రామములోను గాఁపురముండి కుటుంబవ్యవహారములు సమష్టిగా జరపుకొనుచు నత్యంతమైత్రితో నుండువారు. వీరేకాక సాధారణముగా వీరికుటుంబములోఁ బూర్వులయొద్దనుండియుఁ బిన్నలకుఁ బెద్దలయెడల భక్తి



గౌరవములును వినయవిధేయతలును జూపుచుండుటయుఁ బెద్దలు పిన్నలయెడలఁ బ్రేమాతిశయమును, ఉచితశిక్షణమును, గనఁబఱచుచుండుటయు నేఁటివఱకు నవిచ్ఛిన్నమై వచ్చుచున్నవి. కొన్నికుటుంబములలోవలెఁ బెద్దలను బిన్న లెదిరించుటయుఁ బెంకిసమాధానములు చెప్పుటయు నిత్యకృత్యముగాఁ బ్రవర్తించుచుండుటయుఁ బెద్దలుపిన్నలను జీటికిమాటికి నయినదానికిఁ గానిదానికి ననుచితములైన, యవాచ్యములైన తిట్లతో మందలించి వారిని నిర్భయులగునట్లు రేఁచుచుండుటయు నీవంశమున మిక్కిలియరుదు. ప్రస్తుతము మనలోఁ జాలమంది వీరినిజూచి యీపాఠమును నేర్చుకొనవలసిన యవసరము చాలఁగలదు. ఈ యప్రస్తుతవిషయ మింతటితో ముగించి రామస్వామిగారివైద్యమునకు సంబంధించిన కొన్నియుత్తరముల నీదిగువఁ జూపుచున్నాఁడను :—

మహారాజశ్రీ ఆకొండి రామస్వామిగారి సన్నిధికి—

స్నే॥ చెన్నుభొట్ల క్రిష్ణయ్య అనేకనమస్కారములుచేసి చేయంగలవి॥

తమఉత్తరం అందినది. ఇప్పుడు నాకు విశేషజబ్బు తేదు. మామూలుస్థితిలోకి వచ్చినది. చిత్తగించవలెను.

15 మార్చి-

తహశ్శీలుదారు.

శ్రీ వేదమూర్తులైన బ్రహ్మశ్రీ ఆకొండి రామస్వామి గారిసన్నిధికి— కె॥ అరుణాచలశాస్త్రి అనేక నమస్కారములు చేసి వ్రాయంగలవిన్నపములు.

త॥ నాకు ఈరోజున పంపుతానన్న ఔషధము పట్టుకొని రాకోరుతాను. మాభావమరదిగారికి జ్వరము కొంచెము నింపాదిగా యున్నది. చిత్తగించవలెను.

కె॥ అరుణాచలశాస్త్రి.

4-3-98.

శ్రీ శ్రీ బ్రహ్మశ్రీ ఆకొండి రామస్వామిగారికి. సాగి రాజు జగన్నాథరాజు అనేకనమస్కారములు వుంచి వ్రాయంగల విన్నపములు.

త॥ తమరు ఇప్పించిన లేహము తమరు శలవు ఇచ్చిన ప్రకారము పుచ్చుకుంటూయున్నాను. నావంట్లో ఉండేగుణములు యేవత్తూ నివారణ అయినవి. చిత్తగించవలెను.

జగన్నాథరాజువ్రాలు.

ది 24-4-1904.

శ్రీరామసహాయోస్తు.

శ్రీమద్యజనాది షట్కర్మనిరతులైన శ్రీవేదమూర్తులైన ఆకొండి రామస్వామి బావగారి సన్నిధికి— మధునాపంతుల సూరయ్య యనేక నమస్కారములుచేసి చేయంగల విజ్ఞాపనములు.



త॥......మీరు నాకు దయచేసిన యౌషధముచేసిన యుపకార మింతయని వ్రాయజాలను. నాకు వచ్చెడి వగర్పు బాధను శాంతిజేయునట్టి మందు లోకమందు గన్పట్టునాయని చాలారోజులనుండి ధ్యానించుచుండగా నేటి కీయౌషధము గన్పరచితిరి. శివరాత్రికి పూర్వము రెండురోజులున్నూ నాడున్నూ మరునాడున్నూ యీనాలుగురోజులున్నూ బాధచేయునట్టిదై యుండగా పగలు నాలుగుమార్లున్నూ రాత్రి నాలుగు మారులున్నూ ఎక్కువమోతాదులు పుచ్చుకొనేవరకు వగర్పు ఏలాటిదో గన్పడకుండా శ్లేష్మము తరుచుగా తేలికగా పడిపోవుచు అయిదవనాటినుండి యుపశాంతి గల్గినది.

చిత్తగించవలెను.

విధేయుడు సూరయ్య.

18-2-1888.

ఈకామయ్య రామస్వామిగార్లకుఁ బినతండ్రియైన నారప్పగారికి దత్తుఁడు, నౌరసుఁడు నిద్దఱుండినట్టు లిదివఱలో వ్రాసియుంటిని. వారిలోఁ బెద్దవాఁడైన సీతారామయ్యగారను దత్తునియందే పెత్తనముంచి సుబ్రహ్మణ్యముగారాయనకు విధేయులై మెలంగుచు నేకోదరులకన్న నెక్కుడు సౌహార్ద్రిముతో సంచరించుచుఁ గేశనకుర్తిగానే యుండిరి. వీరిరువురును వైద్యశాస్త్రపారంగతులు నుభయభాషాపాండిత్యము గలవారునై యెల్లపుడును బురాణపఠనము గావించుచు స్వ

కులాగతమైన చికిత్సానైపుణ్యమునందుఁ గీర్తి వహించి కపిలేశ్వరపురము మొదలగు జమిందారీస్థలములలో గౌరవము నందుచున్నవారు. సీతారామయ్యగారు సంతానము లేకయే కాలధర్మము నొందిరి. సుబ్రహ్మణ్యముగారికి నారాయణమూర్తి రామమూర్తి యను నిరువురుపుత్త్రులు గలరు. వారలు వైద్యశాస్త్రమును జదివి తండ్రిగారికి సహాయులై యున్నారు.

వెనుకఁ జెప్పఁబడిన రామస్వామిగారి కిద్దఱు కుమారులనియు వారిలో రెండవవాఁడగు రాజగోపాలమును గామయ్యగారికి సంతానలోపమును దీర్చుటకు దత్తునిగా నిచ్చి రనియు నింతకు ముందు తెలిపియున్నానుగదా. ఆ రాజగోపాలము సుగుణసంపదయు సూక్ష్మబుద్ధియు సుందరస్వరూపమును గలిగి యుండి దైవవశమున నల్పాయుష్కుఁడై కాలధర్మము నొందెను. ఈతనియకాలమరణమున నీమహాభిషగ్వంశవృక్షమున నుద్భవించి యభివృద్ధిఁజెంది విస్తరింపఁదగిన యొకమంచి లేఁత కొమ్మ విఱిచివేయఁబడినట్లయిన దని తలంపవచ్చును. రామస్వామిగారికుమారులలో మొదటివారగు రామమూర్తిగారిప్పుడు పోలవరగ్రామవాస్తవ్యులై వైద్యముచేయుచున్నారు. ఈయన చిన్నతనమునందుఁ దమ పెదతండ్రిగారును దండ్రిగారును సజీవులై యుండి కులవిద్యయుఁ గుటుంబభారమును యుక్తమార్గమున నడపుకొనుచుండుటచే నితరములైన సాంసారిక



వ్యాపారము లేవియు లేక మిగుల గారాబముగాఁ బెరుగుచు సంస్కృతాంధ్రగ్రంథములు యథావిధిగా సమర్థులైన పండితులవలన నభ్యసించి చక్కని యుభయభాషాసాహిత్యమును సంపాదింపఁగలిగిరి. ఇదియును గాక ప్రత్యేకముగా నొకసంగీతపాఠకునిఁ బెట్టుకొని కొంతవఱకు గానకళాభ్యాసమునుగూడఁ గావించిరి. తరువాతఁ గ్రమక్రమముగాఁ గులవిద్యయందుఁ బరిశ్రమనుచేసి బాల్యమున సంపాదించిన భాషాద్వయసాహిత్యపాటవముచే వైద్యశాస్త్రగ్రంథముల నన్నిటిని జక్కఁగా విమర్శనదృష్టితోఁ జదివి వానియందలి సారమును గ్రహించి కులక్రమాగతములైన యౌషధయోగరహస్యములను బెదతండ్రిగారివలనను దండ్రిగారివలనను బడసి భైషజ్యమున మిక్కిలి సామర్థ్యమును సంపాదించిరి. ఇదియునుగాక వీరుభయభాషాభ్యాసముచేసి తద్భాషాకావ్యరసానుభవము రుచిచూచినవారగుటచేఁ గవితారచనయం దుత్సుకత గలిగి ఛందోవిషయముల నభ్యసించి కవిత్వముచెప్పుటకు మొదలుపెట్టిరి. ఉభయభాషాపాండిత్యమును గవిత్వరచనయుఁ గలవారగుటచే నీయనకుఁ దఱచు పండితులతోడను గవులతోడను సహవాసముచేయుటయు నట్టివారికిఁ జికిత్సయొనర్చుచుండుటయు సంభవించుచువచ్చినది. మధురమైన కంఠధ్వని గలిగి కొంత గానవిద్యాభ్యాసముచేయుటచే శ్రావ్యముగా నుభయభాషాగ్రంథములను జదువుటయందలి నేర్పుకూడ వీరికి లభించినది. బుద్ధి

విశేషము మెండగుటచే నేవిద్యయందుఁ బ్రవేశించినను వీరి
కది సుసాధ్య మగుచువచ్చినది. వీరు తుదకుఁ జతురంగఖేల
నమునందుసైతము చక్కనిచాతుర్యము సంపాదింపఁగలిగిరి.
ఆయీవిషయములను బ్రశంసించుచుఁ దిరుపతివేంకటకవుల
లో నొక్కరగు శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రులుగా
రొకప్పుడు వీరిపైఁ జెప్పినపద్యము నొకదాని నిదిగువఁ బ్రక
టించుచున్నాను.

మ. కవితన్నైపుణిఁ గాంచి చక్కఁ జతురంగం బాడఁగా మించిగా
నవిధిన్ బద్యములం బఠింపఁదగు విజ్ఞానంబు నార్జించి వం
శవశంబై యెడఁబాయకున్న దగు భైషజ్యంబునం జక్రవ
ర్తివి యై యొప్పితి రామమూర్తి! శమితార్తీ? కీర్తికి
[మూర్తివై.

రానురాను వీరు వైద్యవిద్యాపారంగతత్వమునను గవి
తారచనానైపుణ్యమునను మిక్కిలి సామర్థ్యముఁ బడసిరి.
ఒకచేత నుప్రశస్తౌషధప్రయోగములును, రెండవచేత విచిత్ర
పదప్రయోగములును జేయుచు యౌవనదశ నంతను సంతో
షోత్సాహములతోఁ గడపిరి. "స్వయంతీర్ణః పరాంస్తారయతి"
అనునట్లుగా వీరు తమంతటఁ దామే కావ్యరసాస్వాదనమును
జేయుచు నూరకుండక పురాణపఠనముచేఁ బెక్కండ్రు సరసు
లచేఁ గవితారసాస్వాదనము చేయించుటయేగాక యారో
గ్యాభివృద్ధికై మఱి కొందఱుసరసులచేఁ బరిశుద్ధ మగు నింగిలీ



కరసాస్వాదనముఁ గూడఁ జేయించుచువచ్చిరి. రసశుద్ధియం
దీయనకుఁ బెట్టినదే పేరు. కవిత్వమునందుఁ గవితారసము
నెంత స్వేచ్ఛగా నొప్పింతురో వైద్యమునం దింగిలీకరసమును
వీ రంత స్వేచ్ఛగా నడపఁగలరు. ఇట్లని వీరెప్పుడును రస
విషగంధకములతోడనే వైద్యముసేయువా రని యెంతమాత్ర
మును భావింపఁగూడదు. నిదానవిషయమున నద్వితీయులు!
మం దక్కఱలేకయే ప్రకృతియే రోగనివారణము చేయఁగల
దనియుఁ దినదినమును మనమాహారపదార్థములుగా నుపయో
గించెడు వస్తువులలోనే యౌషధసత్త్వము పరమకారుణికుఁడగు
భగవంతుఁడు మనకుఁ బ్రసాదించియున్నాఁ డనియు వానిగు
ణవిశేషముల నెఱిఁగి రోగానుగుణముగా హితమితాశనము
చేయించి యారోగ్యము కలిగించుటయే వైద్యునిపనియనియు
వీరిమతము. ఆకారణముచే వీరికిఁ దఱచుగా మహౌషధముల
నుపయోగింపవలసిన యత్యవసరము తటస్థించినపుడే కాని
మందులసంచిమూతి విప్పనలవాటు లేదు. ఆమహావీర్యవంత
ములైన యౌషధములు పెంపుడుత్రాఁచుపాములవలె నాసం
చియందే విషముఁ గ్రక్కుచు రోఁజుచు నాల్కలుగ్రోల్చుచు
నడఁగియుండవలసినవే. రోగిని జూచినవెంటనే రోగస్వభావ
మును గ్రహించి ధాతుపరీక్షవలన రోగతత్త్వమును సంపూర్ణ
ముగా నెఱిఁగి రోగానుగుణములైన చిత్రచికిత్సలుచేయుటలో
రామమూర్తిగారికి విశేషకౌశలముగలదని చెప్పినమాట నాది

గాదు. కావున నాకత్యంతసంబంధియైన యీయనకు నే నోత్కృష్టమును వెచ్చుటకై యతిశయోక్తులు వ్రాయుచున్నానేమో యనుభయము నాకుండవలసిన యవసరము లేదు. సమయములో సమయము నాకును రామమూర్తిగారికిని గల సంబంధము ప్రస్తావనవచ్చినది కనుక నిచటనే వెల్లడించుచున్నాను. నే నొకప్పుడు శ్రీ శ్రీ శ్రీ తునిరాణీగారి దర్శనమునకొకకార్యార్థినై యేగినప్పుడు వ్రాసిపంపిన యీక్రిందిపద్యమువలన నాకును రామమూర్తిగారికిని గలసంబంధాదులు వెల్లడికాఁగలవు. కావున నది యిచ్చట వ్రాయుచున్నాను.

శా. శ్రీమంతంబును నీకుఁ బుట్టినిలునై చెల్వారు కోలంకకున్
సామీప్యంబయి పల్లెపాలె మను సంజ్ఞన్ సస్యసంపన్నమౌ
గ్రామమ్మొక్కటియొప్పునందునను నేఁగాఁపుండు నాకొండిశ్రీ
రామస్వామితనూభవుం డయినశ్రీరామార్యు మేనల్లుఁడన్
మామామయ్యయె నాకు వైద్యమును బ్రేమం జారఁగాఁ
జెప్పె నే
నా మీఁదన్దగ ధర్మవైద్యమును జేయంబూనితి న్రాజ్ఞిరో!

ఈపద్యమునుబట్టి నేను రామమూర్తిగారికి కేవలము మేనల్లుఁడను వైద్యశిష్యుఁడను నై యున్నట్లుమాత్రమే పాఠకులు గ్రహింపఁగలరు. కాని నేను రామమూర్తిగారి కల్లుఁడనుగూడ నై యున్నట్లు నేను జెప్పకుండ నెవ్వరు గ్రహింపఁగలరు? మేనల్లుఁడనై యల్లుఁడనై శిష్యుఁడనై యున్న నేను



నా మేనమామయు మామగాడును గురువును నైన యీరామమూర్తిగారిని గుఱించికాని, యీయాకొండివారివైద్యమునుగుఱించికాని యేమి వ్రాసినను నతిశయోక్తిగానే లోకము భావించు నని యెఱిఁగియుండియు, నే నది లెక్కగొనక నాహృదయమునకు స్వభావోక్తి యని తోఁచినదానిలోఁ గొంత సంకుచితముఁజేసి సంగ్రహముగా నీచరిత్రాంశములు వ్రాసియున్నా నని నానమ్మకము. ఇంతవఱకీపని యొనరించుట నాకు విధాయకకృత్య మని తోఁచుటచేఁ జేసితిని; కాని యిఁక నీ రామమూర్తిగారినిగుఱించి తెలియఁజేయవలసిన కొన్నివిషయముల కిప్పుడు సజీవులై యున్నవారి లేఖలనే ప్రకటించుచున్నాను; కనుక స్వభావోక్తియో యతిశయోక్తియో యాభారమాలేఖకులమీఁదనే యుంచి వారు వారు వ్రాసిన లేఖలలోఁ గొన్నిటినిమాత్రము ప్రకటించుచున్నాను.

(1) రామమూర్తిగారు రాజవైద్యు లనుటకు:—

No.——of 192 .
D.

MAHARAJAH'S OFFICE,
PITHAPURAM.
Dated 16-1-1923.
జరూరు.

From
**The Maharajah R.V.K.M. Suryarao Bahadur Garu, C. B. E. Pithapuram.**

To Messrs ఆకొండి రామమూర్తి &
సత్యనారాయణమూర్తిగార్లకు.—

Sir,

శ్రీమహారాజావారు మీవల్ల యీక్రిందిహంశములను తెలుసుకోవలశ్నిదిగా శలవిచ్చినారు గాన యీమనిషిపరంగా జవాబు యిప్పించకోర్తాను.

| జబ్బు | పుచ్చుకోదలచినమందు |
|---|---|
| అజీర్ణవ్యాధి | శతపుత్రాభ్రకం |

పయి నుదహరించిన ఆవుషధము రోజుకు ఎంతెంత మోతాదు ఎన్నిసార్లు పుచ్చుకోవలెను అందుకు పథ్యమున్ను తెలియజేయగోరెదను.

చిత్తగించవలెను.

డ్రో. రామమూర్తి.

16-1-23. *For Dewan.*

తుని

26-1-26

రాజశ్రీ ఆకొండి రామమూర్తిగారికి—

శ్రీరాజా వత్సవాయ వెంకటసూర్యనారాయణ జగపతి రాజు బహద్దరుగారు నమస్కారములు.

త॥ ఇచ్చట క్షేమం. అచ్చట మీయోగక్షేమము



తప్పు వ్రాయిస్తూ యుండవలెను మీరు యిదివరలో వ్రాశిన ఉత్తరం చేరినది శ్రీరస్తు॥ చి॥ మాపెదచిట్టెమ్మకు 2 రోజుల నుంచి కొంచము రక్తము కలసి విరేచనములు అగుచున్నవి గన్క యీవుత్తరం చూచినవెంటనే మీరు ఒకసారి వచ్చి 2-3 రోజులు వుండి వెళ్లినయడల సంతోషిస్తాము త్వరలో వస్తున్నారు గన్క విస్తరించి వ్రాయలేదు.

ఆంతర్యమునకు తేవలెను.

శ్రీరాజా వత్సవాయ వెంకటసూర్యనారాయణ
జగపతిరాజు బహద్దరుగారు.

రాజశ్రీ ఆకొండి రామమూర్తిగారికి—

శ్రీరాజా వత్సవాయ వేంకటసుభద్రియ్యమ్మ జగపతి బహద్దరు రాణీగారు నమస్కారములు.

మిమ్ములను వకపర్యాయం యీమకాముకు వచ్చి వెళ్లమని శ్రీరస్తు చిరంజీవి రాజా బాబు వ్రాసిన లెటరు మీకు చేరే యున్నది. మీరు వస్తున్నామని చెప్పినట్టుకూడా తెలిసినది గాని యేకారణంచేతనో మీరు రావడం జరగలేదు గన్క యీవుత్తరం చూచినవెంటనే వకపర్యాయం బయలుదేరి రావలెను.

ఆంతర్యముకు తేవలెను. 28-1-26.

శ్రీరాజా వత్సవాయ వెంకటసూర్యనారాయణ
జగపతిరాజు బహద్దరుగారు.

తం వ్రాసుకొన్నాను. ఆవుత్తరం త్మకు అందినట్టు వ్రాయించి
నారు గారు ప్రస్తుతం ఖులాసాగా వుంటూవున్నది.........

చిత్తగించవలెను.

రాజా కా॥ వెంకటరామచంద్రరాజు.

14-8-27.

(2) రామమూర్తిగారియెడల గొందఱువైద్యులకు గురుభక్తిసహితము గలదనుటకు.

శ్రీరాములు.

శ్రీవేదమూర్తులైన బ్రహ్మశ్రీ ఆకొండి రామమూర్తిగారి సన్నిధికి—

సముద్రాల భాష్యకారాచార్యు లనేకనమస్కారములు చేసి చాయంగలవిజ్ఞాపనములు.

కుశలద్వయోపరి.

.........తెల్లకుసుమ ఎఱ్ఱకుసుమలకున్నూ ఇంకా ఇతరములైన వైద్యసంబంధమైన రహస్యయోగము లున్న నాయందు కరుణించి వ్రాయించకోరుతాను. ఇప్పుడు కలిగే జబ్బులు వాటిస్వరూపములు తమరు చిత్తగిస్తున్నారు గనుక వ్రాయించి పంపించకోరుతాను. నేను కేవలపరమార్థంకొరకే చేస్తూన్నాను గనుక ఈఫలితమునకు కారణం తమరై యుంటారు. కామెర్లు క్షయవాతములకు ఇంకా ఇతరమైన మరికొన్ని



యోగములు వ్రాయించకోరుతాను. తమరు నన్ను ముఖ్య శిష్యుణ్ణికింద భావించి నాకు ఉపకారమును చేయించకోరుతాను శలవైతే ఒకసారి దర్శనమునకు తమ్మరమంటే వచ్చి 15 దినములు అక్కడవుండమంటే ఉంటాను సులభమైన కొన్ని ఔషధములుకూడా చేయించి దయచేయవచ్చును ప్రస్తుతం నాకోరికప్రకారం జవాబు దయచేయించకోరుతాను శ్రమయిచ్చినందుకు క్షమించవలెను.

చిత్తగించవలెను.

25 3-11 స॥ భాష్యకారాచార్యులువ్రాలు.

28-12-26.

శ్రీవేదమూర్తులైన ఆకొండి రామమూర్తిగారికి—

గొడవర్తి శేషయ్య వ్రాసేదేమనగా యిక్కడ తమతో చెప్పిన పిల్లవిషయమై బంగారముతో తయారుచేసి ఇచ్చినాను ఇప్పటికి 15 రోజులైనది చాలా తగ్గినట్టు కనుపడుతుంది......అందుకు తగిన అవుషధము తెలియచేయకోరుతాను మొదటికేసులో యిచ్చిన బహుమానము తమకు పండగలోపుగ దాఖలుచేసుకుంటాను......పథ్యము వ్రాయకోరుతాను తమ జవాబుకు నిరీక్షించుచున్నాను యీక్రిందిమోస్తరుగా ఉత్తరం వ్రాయకోరుతాను.

చిత్తగించవలెను.
గొడవర్తి శేషయ్య.

(౩) ఆంగ్లేయవైద్యులుకూడ రామమూర్తిగారి వైద్య సాహాయ్యము నప్పుడప్పుడు కోరుచుందు రనుటకు—

Rajahmundry                10—1—27.

To

Akundi Rama Murty Gar

Coconada

Mattai Subbarao gar wants your presence start Immediately.

Rama Row.

Rajahmundry                2—3—27

To

Appana Venkata Raju Cocanada.

Send Akondi Rama Murty Gar to-morrow morning passenger.

Apanas.

Ellore                2—12—25

To

Akundi Rama Murty Gar Cocanada.

Kalavati tapped needs precaution start immediately.

Suryanarayana Row.

(4) రామమూర్తిగారు కవియనుటకు:—

క. శ్రీమహితపీఠపురల
క్ష్మీమహిళావల్లభునకు శ్రీసూర్యమహా



భూమీశ్వరునకు సకల
క్షేమంబులు గలుగుఁగాత శ్రీహరికరుణన్.

మ. తడవాయెన్ దమసౌఖ్యవార్త విని మోధాత్రీతలాధీశ! యు
క్కడ క్షేమయ్యెడ యుష్మదాజ్ఞఁ బరమోత్కర్షంబునన్ వచ్చిన
ప్పుడు చేకూరినయట్టి యా పరిచయంబుల్ నన్ బ్రబోధించు నె
ప్పుడు మీ క్షేమసమృద్ధులన్ శ్రవణసంపూర్ణంబుగాఁ
గ్రోలఁగన్.

ఆ. అరిగె వత్సరద్వయం బిప్పటికి మహీ
పాలతిలక! పీఠపట్టణంబు
వచ్చియుండి కాన నచ్చటి తమసౌఖ్య
వార్త వినమనంబు వాంఛఁ జేసె.

క. తమయశౌదార్యము తమయు
త్తమచరితము తమరసజ్ఞతయుఁ బేరెకన్
దమకుశలస్థితి విన నీ
క్రమమున నీలేఖ వ్రాయఁగాఁ దోఁచె నృపా!

సీ. అశ్వినేయులకరుణ ననామయంబు
సంతతారోగ్యలక్ష్మి ధన్వంతరికృప
నభిమతసుఖాభివృద్ధి పతంజలిదయఁ
బడసి వర్ధిల్లు మో మహీపాలమౌళి!

## పై లేఖకుఁ బ్రత్యుత్తరము.

MAHARAJAH OF PITHAPURAM.
Dunmore
Teynampet
MADRAS S. W.

అయ్యా!

నమస్కృతులు.

తమరు దయతో వ్రాసి యనిపిన పద్యలేఖ చేరినది. చూచి సంతసించితిని. మీయాశీర్వచనముల కెంతయుఁ గృతజ్ఞుఁడను.

శ్రీ పరమేశ్వరానుగ్రహమున మే మెల్లరము సుఖులమై యున్నవారము.

చిత్తగించవలెను.

(Sd.) R. V. K. M. Surya Rau.

## మిత్రస్మృతి.

శా. అన్నా! అచ్యుతరామరాజధరణీశా! నీవు నీనాఁటితో
డన్నాళ్లేండ్లనునిండిపోయెనొకో? కట్టా! మమ్ములం బాసియిం
కెన్నండు న్గనరానితావునకుఁ బోతే! నీకును మాకు వి
చ్ఛిన్నంబయ్యెనెస్నేహబంధమదియున్నీ! మూలవిధ్వస్తమై



సీ. దొరకునే నీజోటి పరమమిత్రుఁడు మాకు
మరల సహస్రజన్మములకైనఁ?
గాంతుమే దివ్యమంగళమైన నీమూర్తిఁ
గన్నులారఁగ నింక నెన్నఁడైన?
విందుమే భావగంభీరంబు లగునీదు
పలుకులు మరల నెప్పటికి నైన?
తొలఁగునే నీవు మమ్ముల వీడి యరిగిన
కడిఁదిలోపం బ దెయ్యెడలనైన?

గీ. అక్కటా! యెంతలో నెంత యయ్యెఁ, గాల
మిప్పుడే నిన్నుఁ గొనిపోయె నయ్య? మరల
మాకుఁ గనఁబడకుండఁగ మాయమైతె?
రవిసదృశతేజ! యచ్యుతరామరాజ!

మ. సువిశాలం బగుఫాలభాగమున సంశుద్ధోర్ధ్వపుండ్రంబు దీ
ప్తివహింపన్, ధవళాబ్జపత్రములరీతిం బొల్చు దీపించు క
న్గవ నెంతేసిరులొప్ప, హాసపరిపూర్ణంబైన నీమోము మా
కు విలోకించెడుభాగ్య మెన్నఁటికిఁ జేకూరున్సుహృద్వల్లభా!

సీ. అరులు వచ్చిననైన సరసోక్తులే కాని
పరుసంబు లేనాఁడు పలుకవైతి
స్వపరపక్షములందు సమభావమే కాని
పక్షపాతపుబుద్ధిఁ బడయవైతి

యింతత్పో యంతయో యిచ్చుచుంటివెగాని
యెన్నఁడును లేదని యెఱుఁగవైతి
క్రోధమున్నెడఁ బట్టి సాధించుటయెకాని
సామాన్యముగ నెగ్గుసలుప వైతి

గీ. యితరులకుఁ దగవులను దిద్దితివి గాని
ధర్మమార్గంబు నెన్నండుఁ దప్పవైతి
నీదు సుగుణంబు లిన్నియన్ని యని చెప్ప
లేరె? యచ్యుతరామభూవరలలామ.

సీ. ప్రతివత్సరము నొక్కవ్రతముగా మృష్టాన్న
దానంబుఁ జేసిన తత్ఫలంబు
యేకాదశీవ్రతస్వీకార మొనరించి
చేసిన పుణ్యోపవాసఫలము
నిలువ నొక్కింతేని నీడలే కల్లాడు
వారి కిచ్చిన గేహవసతిఫలము
శిథిల మైపోవున్న శ్రీకేశవస్వామి
దేవాలయంబున కిచ్చినట్టిఫలము

గీ. నొక్కఁడేనియు నీకు నాయురభివృద్ధి
సేయ లేదయ్యె నింక నేమి సేయవచ్చు?
ప్రకృతిసౌందర్యగాత్రి! మత్ప్రాణమిత్రి!
రమ్యగుణదీప! యచ్యుతరామభూప?



చ. తరుణ మెఱింగి, నీదయినతత్త్వ మెఱింగి మహామహాపక్ష
స్ఫురణముఁ గల్గి నీగృహముపొర్గునఁ గాఁపురముండి పెక్కువ
త్సరములనుండి వైద్యమునుజల్పితి; నాయువులేని వారి కే
పరికరమున్నఁగాని యది ప్రాణసఖా! ఫలవంత మెట్లగున్?

మ. సవిశేషంబగుభ్రాతృభావము మదిన్ సంపూర్ణమై నిండఁగా
నవసానస్థితియందు నాకరము నీహస్తంబునన్ జేర్చి క
న్గవ నశ్రుల్ దొరఁగంగ నీ వనినవాక్యశ్రేణి యేవేళ నా
శ్రవణద్వంద్వముఁ బాయకున్నయది మిత్రా! స్నేహపా
త్రా! యిఁకన్.

సీ. దుర్మతి కేమని దుర్బుద్ధి పుట్టెనో?
కొనిపోయె నిన్నిట్లు కుటిలవృత్తి
నిదియేమి పశుతయో యెఱుఁగరాకున్నది?
మండించె నిన్నిట్లు మార్గశిరము
చవితికి నిద్ధియేమి చలపాదితనమొకో?
నిన్నిట్లు గొంపోయె నీతిమాలి
తనపొట్టలోఁ బెట్టుకొనియె నిన్నీరీతి
శనివారమున కేమి సహజగుణమొ?

గీ. శుక్లపక్షంబు తా నెంత శుద్ధమయ్యె
వత్సరము మాసమును దిథి వాసరములుఁ
జెడుగులై యుండఁ దా నేమి సేయనేర్చు?
నల్వురుం బోవు త్రోవనే నడచె నదియు.

సీ. సరససల్లాపప్రశంసతోఁ గొన్నాళ్లు
గొన్నాళ్లు పౌరాణగోష్ఠితోడ
చతురంగఖేలనాసక్తితోఁ గొన్నాళ్లు
గొన్నాళ్లు వ్యవహారగోష్ఠితోడ
పరదేశసంచారపరతతోఁ గొన్నాళ్లు
గొన్నాళ్లు సంసారగోష్ఠితోడ
సాహిత్యవిద్యాప్రసక్తితోఁ గొన్నాళ్లు
గొన్నాళ్లు వ్యవసాయగోష్ఠితోడ
గీ. గడపినారము పరిపూర్ణగాఢమైత్రిఁ
బొరయుఁ బొచ్చెంబు లేని సోదరులమాడ్కి
నట్టిదినములు రావుగదయ్య యింక
రసికజనగేయ! యచ్యుతరామరాయ!
గీ. దైన్య మెఱుఁగని సజ్జీవితం బొకండు
వెతలులేని యనాయాసమృతి యొకండు
లోకమున దుర్లభంబులు నీకు నవ్వి
రెండు లభియించె నెంత ధన్యుండవోయి!
గీ. ప్రవిమలంబైన నీయంతరాత్మ కింక
నపునరావృత్తి దివ్యలోకాధివాస
శాశ్వతసుఖంబు నిచ్చు నీశ్వరుఁడు; నీవు
ధన్యతముఁడవె; మరణంబు తప్పునొక్కొ?

(ఐలండు)పోలవరము.
12—12—1921.

ఇట్లు,
ఆకొండి రామమూర్తి.



శ్రీరామసహాయం.

శ్రీమత్కామేశ్వరీ దేవతాయైనమః.

## దేశిక ప్రార్థన.

క. శ్రీలలనాహృదయేశుఁడు
పోలవరస్థేముఁ డఖిలభువనావనదీ
క్షాలోలుఁడు కేశవుఁ డీ
బాలకులకు గురువులకు శుభంబు లొసఁగుతన్. ౧

సీ. నొసట దుంపెసఁగు ముంగురులు ముద్దులఁ జిల్కఁ
బాలబుగ్గల నిగ్గు దేలువారిఁ
జిఱుతిండికై రంతుఁజేసి తల్లుల వెను
వెంటనంటి నటించు చంటివారి
నీడువారలతోడఁగూడి యాడఁదొడంగి
చిన్నిగంతులువైచు చున్నవారి
బడిపేరు విన్నంత భయపడి చీఁకటి
గదులలో డాగంగఁగడఁగువారి

గీ. నక్షరాభ్యాస మొనరించి నట్టివారిఁ
దల్లిదండ్రులు మిము నమ్మి ధైర్యమూని
కింకరులఁజేసి మీ కప్పగించినారు
ఆదరముఁ జూపుఁ డోయుపాధ్యాయులార. ౨

సీ. ఆటపాటలమీఁది యలవాటు మెలమెల్ల
మఱపించుచుందుఁ డో మాన్యులార
చదువునం దాసక్తిఁ జనువుతోఁ బుట్టించి
చేయంగఁ దీయుఁ డో ధీరులార
వినయువివేకముల్ వెలయించు నడవడి
నేర్పుఁ డో మహనీయులార
తల్లిదండ్రులయెడ దైవంబునందును
భక్తిగల్గింపుఁ డో భవ్యులార
గీ. మతవిరుద్ధములైన ధర్మములనెపుడుఁ
గఱపకుండఁగఁ జేయుఁడో గురువులార!
బాలకుల కన్నిటను మీరె బాధ్యు లగుదు
రమలమతులార! రో యుపాధ్యాయులార! 3

సీ. తెలివితేటలుగల్గి మెలఁగుచుండెడినాఁడు
దలఁపకుందురె మిమ్ము ధన్యులార
ఉద్యోగములలోన నున్నప్డు నిత్యంబు
మొక్కకుందురె మిమ్ముఁ బూజ్యులార
యైశ్వర్యవంతులై యలరారు దినముల
స్మరియింపరే మిమ్ము సదయులార
దారపుత్రారోగ్య దశనొందువేళల
మఱతురే మిమ్ము సన్మాన్యులార



గీ. ఇంతకన్నను సంతోష మేది మీకుఁ
ఇంతకన్నను సత్కీర్తి యేది మీకు
ఇంతకన్న మహాఫలం బేది మీకు
ధన్యమతులార యో యుపాధ్యాయులార. ౪
గీ. బాలు రేయెడ గురువుల భక్తిఁ గొలిచి
కోరి సద్విద్యలను నేర్చికొందురెగాత
గురువు లేయెడ బాలురఁ గూర్మిఁ జూచి
కోరి సద్బోధనము లొసంగుదురుగాత. ౫

ఆ కొం డి రా మ మూ ర్తి.
ఐలండు పోలవరం.

(5) వైద్యవ్యాపనము కలవారనుటకు మహాజనుల మఱికొన్ని యుత్తరములు:—

రాజమండ్రి.
28-9-26

గంటి సుబ్బారాయుడు నమస్కారములు—

చి॥ సౌ॥ విశాలాక్షమ్మ కులాసాగా యున్నట్లు చెప్పినది. ఏమియు దుర్గుణములు లేవు అన్ని సర్దుకున్నవి. తమ ఔషధము సరిపోయినది. బలముకు ఔషధము పంపుతా మని శెలవిచ్చినారు. వెంటనే పంపించవలెను... చిత్తగించవలెను.

శ॥ వ॥ వీరన్న వ్రాలు.

పిఠాపురం
9-10-26

మహారాజశ్రీ ఆకొండి రామమూర్తిశాస్త్రులుగారికి—
పానుగంటి లక్ష్మీనరసింహారావు నమస్కారములు.

మీరు శ్రీ॥ వెంకటరామశాస్త్రులుగారి ద్వారా పంపిన మందులు చేరినవి. పొట్లములు కట్టి యిచ్చుచున్నాను. మీరు ఆమరునాడే వచ్చెద మని చెప్పినారట. మీరాకకొరకు నిరీక్షించుచున్నాము. మీతో మాటలాడవలసియున్నది. మీరు అబ్బాయిని చూచి చాలా రోజులైనది. నెలదినముల కొక్కసారియైనను మీరు చూచితే బాగావుంటుంది......

చిత్తగించవలెను.
పా॥ లక్ష్మీనరసింహారావు.

పిఠాపురం
27-5-26

అయ్యా!

నమస్కారములు—మీరు యిచ్చిన క్రొత్త పొట్లములు సోమవారము సాయంకాలమునుండియే యిచ్చుచున్నాము. ఆకలి కొంచముగా వృద్ధియగుచున్నది. విరేచనం జారీగానే అగుచున్నది. ఈ రెండు గుణములు మీరు చెప్పినప్రకారమే



కలిగినవి......మీరు వచ్చి పిల్లవాని జూచుట సర్వవిధములశ్రేయమైయున్నది. చిత్తగింపుము.
పా॥ ల॥ నరసింహారావు.

యీవేళకు ఔషధము వున్నది. మీ కవసరములేని యెడల 2-3 రోజులకు పంపించకోరినాను—పుట్టినపుచ్చుకుంటూవున్న ఔషధము గుణము నిచ్చుచున్న దని చెప్పవచ్చును.
చిత్తగించవలెను.
10-10 ము॥ అచ్యు॥ రా.

ములుకుట్ల అచ్యుతరామయ్య నమస్కారములు.

యీవుదయమున మామూలుప్రకారము విరేచనము అయినది......గుణము కనుపించినట్లు తోచుచున్నది. రాత్రి పరుండేటప్పుడు వేసుకోవలసినమాత్ర లేదు. పంపించకోరినాను.
చిత్తగించవలెను.
8-10-25. ము. అచ్యు. రా.

ది 22-6-25.

ఆకొండి రామమూర్తిగారిసన్నిధికి—
దంతులూరి వెంకటాప్రియపురాజు నమస్కారములు.

......శ్రీరాజా అత్తయ్యగారికి జ్వరముతగిలినది

ఏకలంఘనముచేసి పత్యం పుచ్చుకొన్నారు. అప్పటినుంచీ అన్నహితవులేదు. వేడి జాస్తిగావున్నట్టు శలవిస్తారు. నీరసము గా వుంటూవున్నారు. యిదిగాక శ్రీరాజాగారు మళ్లీ అవుష ధం పుచ్చుకోవడపువుద్దేశ మున్నది. యిదివరకు పుచ్చుకొన్న అవుషధము కొన్నికొన్ని గుణములు కనుపించినవి గనుక యీ వుత్తరం అందినవెంటనే బయలుదేరి తమను రమ్మనమని శల వు అయినది. .........శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ

చిత్తగించవలెను.

ద. వెంకటరాయపరాజు.

17-10-14

శ్రీకాకుళం.

మహారాజశ్రీ ఆకొండి రామమూర్తిపంతులుగారికి—

పొడుగు వెంకటరమణ దండములు.

త॥ తమరు ఘనవయిద్యులనిన్నీ కీర్తిప్రతిష్టలు వహిం చినవారనిన్నీ ఏక తగుమనిష్యివల్ల విన్నాను. నేను కొంచం తెనుగువయిద్యంలో తమవంటివారి ఆశ్రిమమువల్లను మందు లుకొని చిన్నచిన్నజబ్బులు బాగుచెయ్యడం తగుమాత్రిం నాడెంచెయ్యడం కొంచం ప్రవేశం వున్నది. ఇదివరలో చా లాకాలమునుంచి అజీర్తిజబ్బు కలదు......నాప్రార్థన ఏమన గా తిన్నతిండి జీర్ణంకావడం క్రమంగా విరోచనంకావడం రా



త్రినిద్రి క్రిమంగాపట్టడంలకు ఆలోచించి తగిన అవుషధము గాని లేకుం[illegible]కుకు ఖర్చులు దాఖలు చేసి పుచ్చుకోవలెనని [illegible]......నేను బ్రాహ్మణునికా ను నాగవంశకులస్థుడను......[illegible] నాకు జవాబుఇచ్చేనిమి త్తం ఇందులో అర్ధఅణాస్టాంపుకూడా పంపించియున్నాను. తమఅడ్రిసు పూరాగా వ్రాయించవలెను. నాఅడ్రిసు—

గంజాంజిల్లా శ్రీకాకుళం పాలకొండరోడ్డు

పొడుగు వెంకటరమణ.

లచ్చుమ్మపేట.

28-2-26.

మహారాజశ్రీ ఆకొండి రామమూర్తిపంతులుగారికి—

అండలూరు సోమయాజులు నమస్కారములు.

......మీరు [illegible]పంపిన మందు కుర్రవాడికి గుణముచే సినది. కనుక యిదివరకు యిచ్చినమందే తిరిగి ఒకనెలకు సరి పడేటట్టుగా వి. పి. పార్శిలుద్వారా యీమనకాముకు పంపకో రెదను...

అండలూరి సోమయాజులు విశాఖపట్నంజిల్లా

శృంగవరపుకోటతా॥ కల్లేపల్లిపోస్టు, లచ్చుమ్మపేట

యలమంచిలి.

23-3-18

బ్రహ్మశ్రీ ఆకొండి రామమూర్తి బాబుగారికి—

నరసింహాము నమస్కారములు.

......కడుపునొప్పి మధ్యాహ్నమువేళ 30 వంతులలో 1 వంతు వచ్చుచున్నది. అన్నమరుగుచున్నది. మినపకుడు మరుగుచున్నది.......మరల అవుషధం పంపించకోరినాను.

చిత్తగించవలెను.

వి. అ. నరసింహాము.

అట్లపాడు.

2-4-13.

శ్రీవేదమూర్తులైన బ్రహ్మశ్రీ ఆకొండి రామమూర్తి బాబుగారికి—

నగరం జనార్దనం నమస్కారములు.

......నల్లటిఅవుషధము యిదివరకు పుచ్చుకున్నదాని కంటె గుణముగానున్నది కాబట్టి ఆమందే వెంటనే పంపించ కోరుతాను. విశేషములులేవు. ఔషధముకొరకెదురుచూచుచున్నాను.

చిత్తగించవలెను.

న. జనార్దనం.



క్షేమం.

శ్రీ వేదమూర్తులైన ఆకొండి రామమూర్తిగారికి—

గోపాలశాస్త్రి అనేకనమస్కారములు.

మీరుపంపించిన అవ్రుషధములు అందినవి పుచ్చుకుంటున్నది. బిళ్ల చాలాతగ్గిపోయినది. బహుకొంచము యున్నదేమోయని అనుమానిస్తున్నాము...

విధేయుడు సుసర్ల గోపాలశాస్త్రి.

Hillside, New Nampalle, Hydrabad.

శ్రీవేదమూర్తులైన ఆకొండి రామమూర్తిగారికి—

తణికెళ్ల వీరభద్రుడు నమస్కారములు.

......నేను 15 రోజులలో చెన్నపట్నం వెళ్లవలసియున్నది. ఆసందర్భములో ఒకరోజువచ్చి తమతో సంగతి మాటాడుదును. నాకు తమఔషధము ఉప్పాడిలోనున్నపుడు మిక్కిలి బాగుండెను.......

చిత్తగించవలెను.

తణికెళ్ల వీరభద్రుడు.

శ్రీవేదమూర్తులైన బ్రహ్మశ్రీ ఆకొండి రామమూర్తిగారికి—

స్నేహితుడు చావలిసూర్యప్రకాశరావు అనేకనమస్కారములు

ఇక్కడ చెన్నపట్నంలో కుశలము అక్కడ మీసంతో

పాతికేయములున్న వ్రాయించకోరుతాను......మావదిన గారికోడలు 16 సం॥ వయస్సుగల చిన్నది. మూర్ఛవలన బాధపడుచున్నది......మీరు పైనవ్రాసిన లక్షణములను బట్టి ఆలోచించి యీవ్యాధికి తగినఅవుషధము పంపవలెనని కోరుచున్నాను. 20 రోజులకు సరిపడేఅవుషధం త్వరగా పంపగోరెదను....... చిత్తగించవలయును.

చావలి సూర్యప్రకాశరావు.

మాచవరం. 9-10-1911.

శ్రీవేదమూర్తులైన బ్రహ్మశ్రీ విద్వాన్ ఆకొండి
రామమూర్తిగారికి—

ఆచంట సూర్యప్రకాశరావు అనేకనమస్కారములుచేసి చాయంగలవిన్నపములు. ......చోడిజావ యిప్పించిన రెండు రోజు లయినపిమ్మట విరేచనము సరిగా అగుచున్నది. జావ తీసుకుందునా లేక మరేమిచేయవలయును అని ఆలోచించుచున్నాను. ఇప్పటిస్థితిగతులనుబట్టి చూడగా తమరు ఒకపర్యాయము యిక్కడకు దయచేసి పథ్యమువిషయమై తగిన ఆలోచన చేయించకోరుచున్నాను.......

చిత్తగించవలెను.

ఆచంట సూర్యప్రకాశరావువ్రాలు.



(౮) రామమూర్తిగారిపైఁ గొందఱుకవులు చెప్పిన ప్రశంసాపద్యములు.

క. రాజామాత్యులతో నా
కేజాడన్ విగ్రహం బొకించుకయును లే
కే జరుగుచుండునట్టులు
గాఁ జూడుము రామమూర్తి కరుణావర్తీ !

తిరుపతి వేంకటేశ్వరకవులు.

సీ. గంగాఫలంబు చెన్నంగి మున్నగువాని
నాఁటించి కొబ్బరితోఁటఁ బెంచె
బంగానపల్లి గోవా యనంగఁ బ్రశస్త
ముల నంటుమామిళ్లఁ బ్రోదిచేసె
మధునపంతులవంశమణి సత్యనారాయ
ణాదుల కార్యవైద్యంబుఁ గఱపెఁ
దిరుపతివేంకటేశ్వరుల దేవీభాగ
వతమునం దొక్కపర్వంబుఁ గూర్చె

గీ. గణుతి కెక్కినపండితాగ్రణులను గవి
పుంగవులను నారోగ్యము పొందఁజేసి
తాతతండ్రులకన్న విఖ్యాతిఁ గాంచె
రమ్యగుణపూర్తి యాకొండి రామమూర్తి.

రామకృష్ణకవులు.

సీ. తారకమంత్రచింతకుఁడు భైషజ్యవి
ద్యాతత్త్వవేత్త రామయ్య తాత
తృష్ణావిదూరుఁ డతిప్రశాంతుఁడు తత్త్వ
వేత్త యా నారప్ప పిన్నతాత
ధాతుపరీక్షణదక్షుఁ డౌషధమర్మ
విదుఁడు నా కామన్న పెద్దతండ్రి
నిత్యక్రియాసక్తి నిర్మలాంతశ్శుద్ధి
గలుగు రామస్వామి కన్నతండ్రి
సుందరదేహుండు సుజనప్రియుండు నై
చను రాజగోపాల మనుఁగుతమ్ముఁ
డమలచిత్తులు సర్వసములు సీతారామ
సుబ్బరాయాంకభాజులు పితృవ్యు
అన్నదానాదర యగు అచ్చమాంబాభి
ధాభవ్యసాధ్వీమతల్లి తల్లి
శ్వశ్రూపరాయణసచ్చిత్త సుబ్బమ్మ
తతదయారసగుణోదార దార
గీ. గలుగువాఁడను నాకొండికులభవుండ
కోవిదప్రియుఁ డాత్రేయగోత్రజుండ
ప్రథితచరకాదివైద్యశాస్త్రప్రవీణుఁ
డమలమతి రామమూర్తినామాంకితుండ.

నిశ్శంకల కృష్ణమూర్తిగారు.



" గీ. ఔషధం బది లోపమం చన్న భూమి
మాఱుమ్రోఁగు యశోరాశి మహితగుణుఁడు
నొసర నాకొండివంశాబ్ధి కుదయసోముఁ
డతఁ డొసంగెను రామమూర్త్యాహ్వయుండు."

తులసి రామమూర్తిగారు.

ఇట్లే యీయాకొండివారివైద్యమును గుఱించి నేను వ్రాసినయంశము లన్నియు సాధారము లైనవియు నతియోక్తు లనియుఁ బాఠకులు భావింపకుందురుగాక యని మనవిచేయుచున్నాను.

## —♦ శిష్యులు, శిష్యపరంపర ♦—

"యో హి గురుభ్య స్సమ్యగాదాయ విద్యాం న ప్రయచ్ఛ త్యం
తేవాసిభ్య స్సఖలు ఋణీ గురుజనస్య మహా దేనో విందతి."

అను వైద్యశాస్త్రప్రసిద్ధమైన మహావాక్యము ననుసరించి కాఁబోలు నీయాకొండివారు మొదటినుండియుఁ దమయొద్దకు వైద్యవిద్యాభ్యాసమునకు వచ్చినశిష్యుల నందఱి నాదరించి సరహస్యమైన వైద్యవిద్య నుపదేశించుచు నుండెడివారు. ఆకారణమున నాకొండివారివైద్యము వీరికుటుంబములయందే కాక యన్యకుటుంబములయందుఁగూడ వ్యాపించి తన శాఖా

రభూతములైన పాత్రములయొక్క గుణవిశేషములనుబట్టి ప్రకాశించుచువచ్చినది. ఆకొండివారియొద్ద వైద్యము నేర్చుకొన్నవారిలో ముఖ్యులు, మల్లవారు, దుడ్డువారు, అల్లంరాజువారు, ఆనిమెళ్లవారు, కోటవారు, మధునాపంతులవారు, మున్నగువారు. వీరిలోఁ జాలమంది యాకొండివారికి సన్నిహితబంధువులు (అనఁగా, మేనల్లుండ్రు, బావమఱఁదులు, అల్లుండ్రు మొదలగువారు.) దీనింబట్టిచూడఁగా నీయాకొండివారు తమయింటి యాఁడుపడుచుల నన్యకుటుంబములలోని పెండ్లికొడుకులకుఁ గన్యాప్రదానము సేయునపుడు వారితోపాటు తరతరములనుండి తమయింటి యాఁడుబిడ్డయై వచ్చుచున్న వైద్యవిద్యాకన్యకనుగూడ దానముసేయుచున్నట్లు కనుపట్టుచున్నది. కన్యాప్రదానముచేయునపు డత్యాప్తసంబంధములనే (మేనఱికములు మొదలగునవి) వెదకుకొనుట మనలో నాచారమైయుండుటచేఁ గాఁబోలు వైద్యవిద్యాకన్యాప్రదానమునందు సహితము వీరు సన్నిహితసంబంధమునే వెదకికొనుచు వచ్చినట్లు చెప్పవచ్చును. ఇట్లనుటచే నన్యులకు (అనఁగా సంబంధబాంధవ్యములులేనివారికి) వైద్యోపదేశముచేయుట వీరికిష్టము కాదని చెప్పుటకువలనుపడదు. మల్లవారు, గోవిందవఝ్ఝలవారు మొదలగు శాఖాంతరులకుసైతము వీరు వైద్యవిద్యోపదేశమును జేసియేయున్నారు. వీరియొద్దఁ బ్రత్యేకముగా వైద్యాభ్యాసముసేయకపోయినను వీరివలన నొక్కొక్కయౌషధయోగము నభ్యసించి నేత్రవైద్యమో వ్రణవైద్యమో మఱియేదియో (మొదలగునవి) చేసికొని తమ్మూలమున జీవనోపాధిచేయువారు మఱికొందరుకలరు. ఏవిధమునన నైననేమి గోదారీమండలవైద్యులలోఁ బెక్కండ్రకుఁ గేవలముగా నైననేమి వీరివైద్యోపదేశముకల దని చెప్పవచ్చును.



పైని చెప్పినచొప్పున నీయాకొండివారివలనఁ గన్యాస్వీకరణముతోపాటు వైద్యకన్యాస్వీకరణము చేసినవారిలో నేనొకఁడను. నేను మామేనమామగారైన రామమూర్తిగారివలన బాల్యమునుండియు వైద్యోపదేశమును బొందుచు నింతదనుకను వారి యుపదేశానుసరణముననే వైద్యవృత్తిచే జీవనము చేయుచున్నాను. నాకు నివాసస్థలమైన కాకినాడతాలూకాలోని పల్లెపాలెమను గ్రామమున నాశక్త్యనుసార మొకచిన్నధర్మవైద్యశాలను నెలకొల్పి పేదసాదల కుచితవైద్యము చేయుచు, నీయఁగలవారివలన నాకుటుంబపోషణమునకు వారియిచ్ఛాధీనములైన పారితోషికములను బొందుచు స్వతంత్రముగాఁ గాలక్షేపము చేయుచున్నాను. అప్పుడప్పుడు సూదివెనుకఁ బోవు దారమువలె నామేనమామగారివెంటఁ గొన్నికొన్ని స్థలములకు వైద్యముసేయఁబోవుటయుఁ గలదు. మా ధర్మవైద్యాశ్రమవార్షికోత్సవాది సందర్భములయందు వారు చెప్పిన కొన్ని పద్యముల నీక్రింద ప్రకటించి తమ్మూలమున నాకు సంబంధించిన కొన్ని యంశములను పాఠకులకుఁ

తెలియఁబఱచి యీయాకొండివారి వైద్యప్రశంసయందు నా
స్వీయచరిత్రము నేనే వ్రాసికొనవలసినయవసరము లేకుండఁ
జేసికొని యీగ్రంథమును ముగించుచున్నాను.

శ్రీరస్తు.

## ధర్మవైద్యాశ్రమస్థాపనము.

సీ. శ్రీవసుధాపతి గ్రీవాలసల్లలం
    తికనా జెలంగు నాత్రేయిచెంత
నాంధ్రదేశంబున కత్యర్థభావుకా
    అంకారమై రమాలలన కున్కి
పట్టగు శ్రీ వల్లెపాలెంబునందు న
    గణ్యపుణ్యాచారఘనులు విప్ర
కులజులు భార్గవగోత్ర సంజనులు
    మూర్తిత్రయామ్నామోదకలితు

లఖిల సద్గుణ సంచయహావణితోత్త
మామలయశోవిరాజితు లార్యవినుత
సచ్చరిత్రులు పండితు లౌసమ్యచిత్తు
లలరుదురు మధునాపంతు లాన్వయజులు.

సీ. తన్మహితాన్వయోదధిపూర్ణహరిణలాం
    ఛనుఁడు శేషాఖ్య విచక్షణుండు



చెలువొందె దత్సుతశ్రేష్ఠుఁడై సద్వదా
    వదుఁడు సుబ్రహ్మణ్య సదమలాభి
ధానుండు జెన్నారె దత్తనూజుఁడు వేంక
    టాచలవిల సదాహ్వయుఁడు దశరె
దత్పుత్రరత్నమై ధారుణి నెల్లెడ
    సద్వైద్యు లనెడు యశంబుగనిశ

యాకొండి విమలాన్వయాభరణు లగురా
    మస్వామి శాస్త్రుల మనుమఁడై సు
రమ్యకీర్తి విశాలుఁడౌ రామమూర్తి
భావుకాఖ్యుని శిష్యుఁడు భాగినేయ
కుండు నై వైద్యశాస్త్రంబు గోర్కెఁ జదివి
రాజిలుచునుండె సత్యనారాయణుండు.

సీ. వైద్యశాస్త్రం బిట్లవారితగతి నేర్చి
    తత్సంప్రదాయము ల్దగ నెఱింగి
యంత్రవిధానంబు లాసక్తిఁ దెలిసి స
    ర్వౌషధకరణ విశేషవిధుల
బాగుగనేర్చి సంప్రాప్త సదాచార
    సంపన్నుఁడై ధైర్యసత్త్వముఁ గాంచి
సత్కృపావంతుఁడై శాంతమనస్కుఁడై
    యాలస్యరహితుఁడై యాస విడిచి

సత్కీర్తి కాముడై సన్మార్గవర్తియై
సర్వరోగనిదాన శక్తి వడసి
గర్వమొక్కింతయును లేక గౌరవంబె
ముఖ్యముగ నెంచి ధార్మికబుద్ధి వెలయ
నిఖిలజనులకు నుపకృతి నెరపుచుండె
సంతతము వైద్య మొనరించి జనులు వొగడ.

సీ. సకలవైద్యార్హ లక్షణవంతుడౌ సత్య
నారాయణుండు సన్మానమొదవ
రోగుల నెల్ల నీరోగుల గావించి
యారోగ్య మొసగుచు నవని దనదు
ధార్మికత్వము దెల్ప ధర్మవైద్యాశ్రమ
మొప్పుగా స్థాపించె నూర్జితమతి
నెల్లయౌషధముల నెంతయు నేరుపు
గొనబార జేయుచు గొదువ లేక

యెవ్వ రెత్తరినేగిన నెలమి వెలయ
నౌషధంబు లొసంగుచు నచ్చెరువుగ
నెంతదవ్వైన గడకతో నేగి వైద్య
మొప్పుగా జేయుచుండె మహోద్యమమున.

శా. ధీరత్వంబున నెల్లవేళల సముద్దీప్తౌషధస్తోమము
న్సాంతంబై నకషాయముఖ్యఘృతములున్సచ్చూర్ణముల్తైలము



ల్చారుద్రావకముల్రసప్రముఖభస్మవ్రాతముల్లేహ్యము
ల్ధారాళంబుగ జేసి రోగులకిడుం దద్వైద్యరత్నంబహా.

సీ. వానివైద్యంబుచే వాతపిత్తకఫోద్భ
వవ్యాధినివహ మవ్యాహతముగ
బ్రహ్మవిష్ణ్వీశాది బర్హిర్ముఖోత్తముల్
శాంతినొందగజేసి జనుల నెల్ల
నాయురారోగ్యమ్ము లనవరతంబిడి
గాచి రక్షింతురుగాక యనుచు
భూసురోత్తములార భాసురామ్నాయ ప
ద్ధతుల నాశీర్వచస్తుతుల నిడుడు
క్షత్రియ విట్శూద్రజనులార తత్సదు
ద్యమమిల నెరవేరదగిన భంగి
ద్రవ్యసాహాయ్యంబు భవ్యప్రచారులై
యాచరింపుచునుండి యశముగనుడు

ధర్మవైద్యం బొనర్చెడు నిర్మలాత్మ
కులను సంతసమున బురికొల్పువారు
నైతము దదీయధర్మసంచయమునందు
బొరయుదురు భాగమును బుణ్యపురుషులార.

సీ. ధర్మకార్యంబుల దమకంబుతో జేయు
వారలగాంచిన వారలెల్ల

పాపంబులెడబాసి పరమపుణ్యాత్ములై
భాసిలుచుండు రెప్పట్టునంద
టంచును ధర్మశాస్త్రావళి మొరపెట్టు
చుండెనట్లుండ మహోత్సుకత్వ
మున వైద్యశాస్త్రంబు బొందుగా బఠియించి
ధర్మవైద్యాశ్రమస్థాపనం బొ
నర్చిన యీసత్యనారాయణునికి బ్రో
త్సాహంబొనర్చెడు సజ్జనులకు

బుణ్యమబ్బునటన్న నబ్బురమెదలప
వారలిల భోగభాగ్యనివహము గాంచి
శాశ్వతపుకీర్తినొంది శశ్వత్సుఖాళి
ననుభవింతురు ముదమున ననుదినంబు.

ఆశీర్వచనము.

గీ. రోగులకు రోగములుబాపి భోగమొంద
జేయబూనిన సత్యనారాయణునకు
ద్రవ్యమిడి ప్రేరణమొనర్చు దాతలెల్ల
నుర్వి ననుదాన ఫలమొందుచుండ్రిగాక.

సీ. అవనిలో ధర్మవైద్యాశ్రమస్థాపన
మొనరించినట్టి యీయనఘమూర్తి



సత్యనారాయణ సదమలనామధే
యుడును భూతలమున హాయిలుమీర
దీర్ఘాయురారోగ్య దివ్యభోగాత్యర్థ
ధనధాన్యచయములు ధార్మికతయు
బుత్రపౌత్రులు దేవపూజనరతిశాశ్వ
తంబగు కీర్తియుడంబుమీఱ
సంతసంబునుగల్గి యొసంగుగాత
నతడునిల్పిన ధర్మవైద్యాశ్రమమును
జరుగుచుండుతనాసూర్యచంద్రతార
కంబుగా ధరణీమండలంబునందు.

గీ. భార్గవర విశ్వనాథ సద్బుధవరుండు
హర్ష మొసలార నవరత్నహారమిటుల
గానుకగానిచ్చె దీనిని గడకదాల్చి
రాజిలుచునుండు సత్యనారాయణుండు.

ది 19 డిసెంబరు
ఆ 1915 సం॥రం

ఇట్లు విన్నవించు కవిజనవిధేయుడు,
భార్గవరపు విశ్వనాథశాస్త్రి.

గీ. మందులనుగూడి యీభిషగ్మందిరంబు
దినదినంబును వృద్ధితో దనరుగాత
మధునసంతుల సత్యధీమణివరుండు

తనరవైద్యముచేయుచు ధర్మమతిని
ప్రజలనందర సంతోషపరచుగాత.

ఓలేటి సీతారామశాస్త్రి.

మెచ్చితి మెల్లవారమును మేలగు నీమృదువైద్యశక్తికిన్
మెచ్చితి మెంతయేనియు నమేయభవత్సముదారబుద్ధికిన్
మెచ్చితి మీవొనర్చిన సమీహితకార్యవిశేషపూర్తికిన్
సచ్చరితా! నిరంతరము సన్నుతిగాంచుము ధర్మబుద్ధితోన్.

పాలెపు అగస్త్యరాజు.

క. శ్రీయుత ! సమధిగతసమ
స్తాయుర్వేదాంగతద్రహస్యబహుతరో
పాయా ! యనపాయచికి
త్సా ! యస్మత్ప్రియసుహృద్వరా ! సత్యసుధీ.

సీ. నీమూలమునఁగదా నామనోహరిపున
ర్జీవంబు నొంది చరింపఁగలిగె
నీమూలమునఁగదా యీమిత్రుఁ డాపదం
భోరాశి విడి యొడ్డుఁ జేరఁగలిగె
నీమూలమునఁగదా నెలమైన నిండని
నాబిడ్డ తల్లిఁ గానంగఁగలిగె



నీమూలమునఁగదా నామామ యత్తయుఁ
బుత్రికాసంప్రాప్తిఁ బొందఁగనిరి

గీ. ప్రాణదానంబు మా కొనరంగఁజేసి
నట్టి నీయుపకారంబు నెట్టు మఱతు
శమితసకలార్తి ! శారదచంద్రకీర్తి !
సత్యనారాయణాఖ్య ! భైషజ్యముఖ్య !

చ. అలఘుతరోపకార మహహా యన మాకొనరించినాఁడ వె
ట్టులు భవదీయచిత్తము గడున్ వికసింపఁగఁజేయనేర్తునే
నిల బలుమాఱు జన్మముల నెత్తిన నీదుఋణంబు దీర్చుకోఁ
గలనె? సతంబు నాకరయుగంబు మొగిడ్చెదఁగాక భక్తితోన్.

గీ. అట్లయైనను నాశక్తి ననుసరించి
యొక్కరీతిని నిన్ను బహూకరింప
నెంచి యీహేమవలయము నిచ్చినాఁడ
జంద్రునకు నూలిపోఁగు నొసంగినట్లు.

చ. కలియుగమందు సత్సఖులు గల్గుట యేరికి దుర్లభంబు నేఁ
దొలిజనిఁ జేసినట్టి సుకృతుల్ ఫలియించెనొ లేక భక్తవ
త్సలుఁ డగు నిష్టదేవునిప్రసాదము గల్గెనొ గాక నాకు నీ
చెలిమి తటస్థమా టరిది శ్రీయుత మామకమిత్రరత్నమా.

ఉ. శీలవిహీనదుర్జనవిశేషసమాశ్రయ మైనయట్టి యి
క్కాలమునం దఖండగుణకాండవిరాజితయుష్మదాదివి

ద్యాలసదార్యమిత్రులముదంబునఁ గూడి చరించుచున్న నా
కేలవిచారముల్ వొడము నీశ్వరుఁ డూరక హానిచేయునే
బాలభిషగ్మణీ ! మధునపంతుల సత్యసుధీవరాగ్రిణీ.

చ. దినదినవర్ధమానభవదీయవినిర్మలకీర్తి దిక్సతీ
జనముల కంచితాభరణసౌష్ఠవమున్ రచియించుఁగాక ! నీ
యనుపమవైద్య ముర్వి సకలార్తిహరంబయి యొప్పుఁగాకనీ
తనయము వైద్యరత్నబిరుదాఢ్యుఁడ వౌదువుగాక మిత్రమా.

శుభమస్తు.

శ్రీయుతులును, నిరవద్యవిచిత్రచికిత్సాకార్యనిర్వాహకులును,
నసంకాశాయుర్వేదపాండిత్యవిరాజితులును నగు
మధునాపంతుల సత్యనారాయణమూర్తిగారికి
చామర్తి సత్యనారాయణమూర్తి వ్రాయు

పంచరత్నములు.

మ. ప్రథితంబై సుజనోపకారకరమై ప్రజ్ఞాతమై దివ్యమై
బుధరాడ్బృందసుసేవితం బగుచు సంపూర్ణప్రభాధామమై
సుధలం జిల్కెడునీదువైద్యముభువిన్ శోభించునశ్రాంతమున్
మధునాపంతులవంశవార్ధిహిమధామా సత్యనారాయణా.



సీ. ఉర్విలో బీదల కుపకార మొనరింపఁ
గా వైద్యశాల నొక్కటిని నిల్పి
సుప్రసిద్ధౌషధస్తోమంబులను జికి
త్సాగ్రంథముల నెల్లఁ దనరఁ గూర్చి
అమృతోపమానలేహ్యముల నానావిధ
పరిశుభ్రభస్మముల్ భద్రపఱచి
ప్రతిదినాగతరోగిబహువిధరోగముల్
మాన్పంగ మంచివౌ మందులిచ్చి

గీ. మాన్పుచున్నావు మఱి యసామాన్యసరణిఁ
గాంచుచున్నావు కీర్తిని ఘనతరముగ
మధునపంతులవంశాబ్ధిమహితచంద్ర
ఆర్యగుణముఖ్య సత్యనారాయణాఖ్య !

శా. సర్వవ్యాధిచయం బనర్గళగతిన్ జక్రాయుధప్రక్రియన్
గుర్వాశీర్వచనప్రభావకమునన్ గుంఠంబుగాఁ జేసిన
ర్వోర్వీనాథులమెప్పులం బడయు నాయుర్వేదవిద్యానిధీ
శర్వాణీప్రియవల్లభుం డిడుత సత్సౌభాగ్యభోగంబులన్.

గీ. ఆంగ్లవైద్యుల కైనను నలవిగాని
రోగముల నెల్లఁ గుదిరిచి రూఢమతిని
హేమపతకంబు లొందితి వెలమి మించి
జయముఁ గాంచుము సర్వత్ర సత్యమూర్తి!

గీ. ఆర్యమిత్రమ సత్యనారాయణాఖ్య !
నీదువైద్యము ధరణి ననింద్య మగుచు
వ్యాప్తిఁ జెందుచు సత్కీర్తిఁ బడయుఁగాత
భూతనాథుండు వ్యాసుండు బ్రోచుఁగాత.

ఇట్లు
చామర్తి సత్యనారాయణశాస్త్రి.

గీ. ధర్మవైద్యాలయంబును స్థాపనంబుఁ
జేసి జగదేకవిఖ్యాతిఁ జెన్నుమిగులు
సత్యనారాయణాఖ్యుఁడౌ సజ్జనునకు
నాయురారోగ్యభోగభాగ్యంబు లొసఁగి
కరుణతోడుత రాముండు గాచుఁగాత
భృంగరాజంబు పంచార్కవిజయభైర
వంబు లోనగు తైలముల్ బరఁగుచుండ
ధనికు లెల్లరు తగురీతి ధనము నొసఁగ
ధర్మవైద్యాలయం బెప్డు దనరుఁగాత
ధరణిలోపల నాచంద్రతారకముగ.

ఇట్లు
చెళ్లపిళ్ల వెంకటరావు.



పి ఠా పు రం

శ్రీవేదమూర్తులైన బ్రహ్మశ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తిగారిసన్నిధికి—

శ్రీరాజా రావు రామయ్యమ్మారావు బహద్దరుగారి గుమాస్తా అవసరాల వెంకట్రావు అనేకనమస్కారములు చేసి చాయంగలవిజ్ఞాపనములు.

......త॥ తమరు శ్రీరాజా అమ్మగారికి దాఖలుచేస్ని లేహ్యం సేవిస్తున్నారు......యీవుత్తరం అందగానే ఒకసారి మీరు వచ్చి శ్రీ॥ అమ్మగారిని చూచి వెళ్లకోరుతాను. అమ్మగారు శెలవిచ్చినందువల్ల వ్రాసినాను. సుస్తీ చాయవద్దు.

చిత్తగించవలెను.
అవసరాల వెంకట్రావువ్రాలు.

మహారాజశ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తిగారికి—దామెర సీతారామస్వామి దండములు.

ఉభయక్షేమోపరి.

త॥ ఇదివరలో మామయ్యగారికి శ్రీమహారాజావారును మహారాణీవారును పిల్లలును క్షేమముగా నున్నటుల వ్రాసితిని. ఇపుడును క్షేమంగానే యున్నారు. మార్పులు లేవు. 15 తేదీనాటికి మామయ్యగారిని తీసుకు రాకోరెదను. ఇటులనే ఆతేదీకి రావలసినదిగా మామయ్యగారికి వ్రాసితిని.

చిత్తగించవలెను.
దామెర సీతారామస్వామి.

26-11-24 కాకినాడ.

అయ్యా!

ఈమధ్య పాలెపు అగస్త్యరాజుగారు ఇచ్చటికి వచ్చినప్పుడు మీవద్దనుంచి భృంగామలకతైలము తీసుకువచ్చి నాకు కొంచెము యిచ్చియున్నారు. అది యింకనూ కావలసియున్నది. ఈ 5 రూపాయలు మనియార్డరుద్వారా మీకు ఈరోజున పంపడమైనది......... చిత్తగించవలెను.

పాలుపల్లి వెంకట్రామయ్య.
వైసుచైరుమన్, మునిసిపల్ ఆఫీసు,
కాకినాడ.

పల్లివన్నుగార్డెనురోడ్డు మైలాపురము
చెన్నపట్నం.
20-1-24.

శ్రీ॥ అన్నగారికి

సేవకుడు పురాణపండ రామేశ్వరరావు నిత్యము అనేకనమస్కారములు.

చి॥ అబ్బాయికి అజీర్ణముచేత తఱుచు జ్వరము వచ్చి చాల చిక్కిపోయి ఉన్నాడు. మునుపు ఆరుసంవత్సరములక్రితము చి॥ చిట్టి ఎట్టిస్థితిలో నుండెనో ఇప్పుడు చి॥ అబ్బాయి కూడ అస్థితిలో నున్నాడు. అప్పుడు మీరు నిమ్మకాయరస



ముతో మందు ఇచ్చిరనియు అందుచేత చి॥ అమ్మాయికి నిమ్మళముగ నున్నదని ఇప్పుడుకూడ అట్టిమందే మీరిచ్చిన చి॥ అబ్బాయికి నిమ్మళించు ననియు మా కందఱకు నమ్మకముగ నున్నది. చిత్తగించవలెను.

రాజమండ్రి
ది 5-9-18

మహారాజశ్రీ వు॥ సత్యనారాయణమూర్తిగారి సముఖమునకు—

సత్యవోలు గున్నేశ్వరరావు అనేకనమస్కారములు.

ఉభయకుశలోపరి.

తాము వ్రాయించిన ఉత్తరం అందినది. మీతమ్ముడుగారుకూడ వచ్చినారు. మీతమ్ముడుగారు పిల్లనుకూడ చూచినారు, రెండురోజులనుంచి తిరిగి సులువుగా యున్నది గోపాలంగారు బహుజాగ్రత్తగా మందు యిచ్చుచున్నారు. తాము తెరపిచేసుకొని ఎటులైనను ఒకపర్యాయము దయచేయ ప్రార్థితులు...... చిత్తగించవలెను.

సత్యవోలు గున్నేశ్వరరావు.


బ్రి॥ ఆకొండి రామమూర్తిగారియొక్కయు, మధునాపంతుల సత్యనారాయణమూర్తిగారియొక్కయు వైద్య మమోఘమైన దనియు నద్వితీయ మైన దనియు రాజవైద్యు లనుటకు వీరే యర్హు లనియు నాయనుభవమువలనఁ జెప్పుచున్నాను. విశేషించి రామమూర్తిగారు మృదుమధురకవనమునయితము మిక్కిలి సమర్థులై యున్నా రని వారిచేఁ దెలిగింపఁబడిన దేవీభాగవతభాగము వేనోళ్లఁ జాటుచున్నది.

న డ కు డు టి వీ ర రా జు,
పిఠాపురము.

భగవదనుగ్రహమువలన నిట్లు బహుకాలమునుండి యవిచ్ఛిన్నమై వచ్చుచున్న యాకొండివారి వైద్యవిద్యను నిలువఁబెట్టి యుత్తరోత్తరాభివృద్ధి గలిగించుటకు రామమూర్తిగారి కిప్పటికి ముగ్గురుకుమారులు గలరు. వారిలో జ్యేష్ఠుఁడైన రాజగోపాలము తండ్రిగారికి వైద్యవిద్యాపరిశ్రమమునందుఁ దోడ్పడుటకుఁ దగినవాఁడైనాఁడు. ఈవైద్యవంశవృక్ష మటుయ వటవృక్షమువలె నల్లుకొనుఁగాత!

శ్రీ శ్రీ శ్రీ.

# ఆకొండివారి వంశవృక్షము




* సీతయ్యగారు రామయ్యగారి కొడుకు; నారప్పగారికి దత్తుడయ్యెను. పిమ్మట ఔరసుడు జనించెను.

† రాజగోపాలముగారు రామస్వామిగారి కొడుకు; కామన్నగారికి దత్తుడు.

# పురాణగ్రంథమాలిక,

## పిఠాపురము.

మనపూర్వఋషులు పురాణములలో వ్రాసిపెట్టిన విజ్ఞానమెల్ల సంస్కృతభాషలో నున్నది. ఆంధ్రుల కది కరతలామలక మగునట్లు తేటతెల్ల మగు తెలుగువచనమున రెండునెలలకు (డెమ్మీసైజు 200—250 పుటలవంతున) నొక్కొక్క సంపుటముగా ముద్రించుచున్నాము. ఇందు చందాదారులగు వారికి ఒక్కొక్కసంపుటము వెల పోస్టేజి మనీఆర్డరు కర్చులు సహా రు 1-0-0 కు మాత్రమే. ఇతరులకు రు 1-8-0 లు. చందాదారులగువారు ప్రవేశరుసుము రు0-4-0 లుమాత్రమే యియ్యవలయునుగాని చందాసొమ్ము ముందుగా నియ్యనక్కఱ లేదు. ఒక్కొక్కసంపుటము ముద్రణమైనతరువాత వి.పి.గా పంపబడును. ఇప్పటికి ముద్రింపబడి వెలకు సిద్ధముగ నున్న గ్రంథములు.

శివపురాణము ౧, ౨, ౩, ౪, ౫ సంపుటములు.

బ్రహ్మపురాణము ౧, ౨ సంపుటములు.

వామనపురాణము ౧ సంపుటము.

కాంగ్రెస్ బహుమానముగా ప్రభవ సం॥ర మకర సంక్రాంతిలోపున పై సంపుటము లన్నియు చందాదారులుగా చేరి తెప్పించుకొనువారికి రు 5-10-0లకు మాత్రమే. (ఇతరులకు రు8-8-0లు) పోస్టేజి వేఱు.

నడకుదుటి వీరరాజు పంతులు,
పురాణగ్రంథమాలిక,
పిఠాపురము.

END OF
TITLE